ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
బుధవారం 19 నవంబరు 2025



ప్రభుత్వ ఐటీఐలో కొత్త కోర్సులు

నెల్లూరు(విద్య), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జాతీయ, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్, కంప్యూటర్ అండ్ పెరిఫెరల్స్(హార్డ్‌వేర్) కోర్సులను ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ కే శ్రీధర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 ద్వారా టెన్త్ ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతకు ఈ స్వల్పకాలిక కోర్సుల్లో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. కోర్సు పూర్తి చేసిన వారు మంచి ఉపాధి అవకాశాలతోపాటు బ్యాంకుల ద్వారా ముద్రా రుణాలు కూడా పొందే అవకాశం ఉంటుందన్నారు. దీనిని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



రైతుల్లేని బజార్లు!

ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను దళారుల ప్రమేయం లేకుండా రైతన్నలే నిర్ణీత ధరకు అమ్ముకునేలా ఏర్పాటు చేసిన రైతుబజార్లలో వ్యాపారుల హవా ఎక్కువైంది. సంవత్సరాల తరబడి వారే దుకాణాల్లో తిష్టవేయడంతో అన్నదాతలు రోడ్డుపైన విక్రయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. మరోవైపు మార్కెట్ ధరకు, రైతు బజారులో ధకు పెద్దగా వ్యత్యాసం లేకపోవడంతో వినియోగ దారుల ఆదరణ కూడా రోజురోజుకు తగ్గిపోతోంది. దీంతో నెల్లూరు, కావలి, కందుకూరు, పొదలకూరులలో షాపులు ఖాళీగా ఉన్నాయి. ఆంధ్రజ్యోతి బృందం మంగళవారం రైతుబజార్లను పరిశీలించింది. ఆ వివరాలు..

- వ్యాపారులదే హవా.. వారు చెప్పిందే ధర
- ఖాళీగా దుకాణాలు
- రోడ్లపై వ్యాపారాలకే రైతుల మొగ్గు
- ప్రజల ఆదరణ కూడా అంతంతే!

కావలిలో వ్యాపార కేంద్రంగా ..

కావలి (ఆంధ్రజ్యోతి) : కావలి రైతుబజారు వ్యాపార కేంద్రంగా మారి పోయింది. ఇక్కడ 105 దుకాణాలకుగాను 100 దుకాణాలలో వ్యాపారులే కూరగాయలు విక్రయిస్తున్నారు. రైతుల కోసం కేవలం ఒక దుకాణం కేటాయించారు. మరో దుకాణం రైస్ మిల్లర్లకు రాయితీపై బియ్యం, పప్పులు విక్రయాలకు కేటాయించారు. మరో మూడు దుకాణాలు ఖాళీగా ఉన్నాయి. రైతుబజారు నిర్మాణానికి తొలివిడతగా రూ.45 కోట్లు మంజూరు కాగా వాటికి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించి నెలలు గడుస్తున్నా ముందుకు సాగలేదు. అలాగే రైతుబజారును పూర్తిస్థాయిలో నిర్మిస్తే ఇబ్బందులు తలెత్తుతాయన్న భావనతో మరలా రూ.55 కోట్లతో మరో ప్రతిపాదన పంపారు. అయితే ఈ ప్రతిపాదన ఇంకా ఆమోదానికి నోచుకోలేదు. దీంతో రెండోవిడత నిధులు కూడా మంజూరైతే మొత్తం కలిపి కట్టాలా లేదా ముందు మంజూరైన నిధులతో నిర్మాణాలు చేపట్టి తదుపరి రెండో విడత చేపట్టాలా అనే సందిగ్ధంలో అధికారులు ఉన్నారు. ఇక రైతుబజారులో బోర్డులపై వేసిన ధరలు మార్కెట్ ధరకన్నాకొంత తక్కువగానే ఉన్నాయి. అయితే ఈ ధరల ప్రకారం కాకుండా వ్యాపారులు అధికధరలకు విక్రయిస్తున్నారు.

భగ్గుమంటున్న ధరలు



పొదలకూరు (ఆంధ్రజ్యోతి) : రైతుబజారులో ధరలు భగ్గుమంటుండ టంతో ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. రూ.45లక్షలతో నిర్మించిన రైతుబజారును 2023, సెప్టెంబరు 13న ప్రారంభించారు. 24 దుకాణాలు ఉండగా, 14 షాపుల్లో వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయి. 10 షాపులు ఖాళీగా ఉన్నాయి. పంచాయతీ బస్టాండ్‌కు, గేట్ సెంటర్లకు ఈ బజారు దూరంగా ఉండడమే ప్రధాన కారణం. పైగా బజారులో వ్యాపారులు ఎక్కువగా ఉంటున్నారు. మార్కెట్ రేటుకు ఇక్కడి ధరకు వ్యత్యాసం పెద్దగా లేకపోవడంతో ప్రజాదరణ తగ్గిపోయింది.

వ్యాపారులదే హవా!

కందుకూరు (ఆంధ్రజ్యోతి) : రైతు బజారులో దుకాణాలన్నీ వ్యాపారుల చేతుల్లోనే నడుస్తున్నాయి. మొత్తం 60 షాపులు ఉండగా కేవలం రెండు షాపులు మాత్రమే రైతులకు కేటాయించారు. అదీ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కూరగాయలు పండిస్తున్న ఇద్దరు ఆదర్శ రైతులకు మూడేళ్లక్రితం కేటాయించారు. రమారమి 10 షాపులు ఖాళీగానే ఉన్నా వాటిని ఎవరికీ కేటాయించకుండా వ్యాపారుల సౌలభ్యం కోసం ఖాళీగానే ఉంచుతున్నారు. నాలుగేళ్లక్రితం మున్సిపల్ కూరగాయల మార్కెట్ శిథిలావస్థకు చేరటంతో దానిని కూల్చివేసి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించగా మార్కెట్‌లోని వ్యాపారులంతా రైతు బజారులో తాత్కాలిక ఆశ్రయం పేరుతో చేరిపోయి అక్కడే తిష్టవేశారు. దీంతో మొత్తం 50 దుకాణాలు వ్యాపారుల చేతుల్లోనే ఉన్నాయి. దీంతో ఎక్కడా ధరల పట్టికలు కూడా కనిపించవు. ధరల్లో వ్యత్యాసం కూడా ఏమీ లేకపోవడంతో వినియోగదారుల ఆదరణ తగ్గిపోయింది.

వినియోగదారులు లేక బోసిపోయిన నవాబుపేట రైతుబజారు



నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నెల్లూరులో రెండు రైతుబజార్లు ఉండగా, ఫత్తేఖాన్‌పేట సమీపంలో ఉన్న రైతుబజారుకు ఆదరణ కరువైంది. మద్రాసు బస్టాండు వద్ద ప్రధాన కూరగాయల మార్కెట్ ఉండటంతో ఎక్కువమంది అక్కడకే వెళ్లి కాయగూరలు తెచ్చుకుంటున్నారు. కాలక్రమేణా ఆదరణ లేకపోవడంతో రైతులు కూడా ఇటువైపు రావడం మానేశారు. కొంతమంది బియ్యం, ఉల్లిపాయలు, టమోటాల వ్యాపారం చేసినా క్రమేణా అవి కూడా నిలిచిపోయాయి. ఇప్పుడు ప్రొవిజన్ షాపులు, కొన్ని ప్రైవేటు కార్యాలయాలు, ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన ఉత్పత్తులు, టిఫిన్ సెంటర్లు దర్శనమిస్తున్నాయి. ఇక్కడ 81 దుకాణాలు ఉండగా 43 దుకాణాల్లో మాత్రమే వ్యాపార లావాదేవీలు నడుస్తున్నాయి. 38 దుకాణాలు ఖాళీగా ఉన్నాయి.

ఆదరణ కరువై..

- నవాబుపేటలోని రైతుబజారు ప్రారంభంలో రైతులతో కిటకిటలాడింది. నారాయణరెడ్డిపేట, తోటపల్లిగూడూరు, ఇందుకూరుపేట తదితర ప్రాంతాల నుంచి రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను బస్సులు, ఆటోల్లో తీసుకొచ్చి అమ్ముకునేవారు. అయితే, అందరూ మద్రాసు బస్టాండు కూరగాయల మార్కెట్‌కు వెళ్లిపోవడంతో రైతులు ఇటువైపు చూడటం మానేశారు. దీంతో కొంతమం ది వ్యాపారులు రైతుల వద్ద కూరగాయ లు కొనుగోలు చేసుని ఇక్కడ అమ్ముతు న్నారు. మొత్తం 58 దుకాణాలకు గాను 46 దుకాణాల్లో అద్దె వసూలవుతోంది. మిగిలిన 12 దుకాణాలు ఖాళీగా ఉన్నాయి.

- ధరల్లో తేడా

కూరగాయల మార్కెట్‌కు, రైతుబజారుకు ధరల్లో కాస్త వ్యత్యాసం ఉంటోంది. మార్కెట్ ధర ప్రకారమే ఇక్కడ వ్యాపారాలు సాగేవని కొంతమంది వ్యాపారులు చెబుతున్నారు. అయితే వినియోగదారులు మార్కెట్‌లో తక్కువ ధరకు లభిస్తాయని రావడం మానేశారు. దీంతో వ్యాపారాలు లేక రైతులు మద్రాసు బస్టాండుతోపాటు రోడ్డు పక్కన కూడళ్ల వద్ద తమ ఉత్పత్తులు అమ్ముకుంటున్నారు. నవాబుపేట రైతుబజారులో మార్కెట్ ధరతో పోల్చితే రూ.5 ఎక్కువకు విక్రయిస్తున్నారు.



కేంద్రమంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న కలెక్టరు హిమాన్షు శుక్లా, పక్కన డ్వామా పీడీ గంగాభవాని

డ్వామాకి జాతీయ అవార్డు

- కేంద్ర మంత్రి నుంచి అందుకున్న కలెక్టరు

నెల్లూరు, (జడ్పీ), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జల్ సంచయ్-జన్ భాగీదారీ (జేఎస్‌జేబీ)-2015 అరుదైన అవార్డు నెల్లూరు జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా)కు దక్కింది. నీటి సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం, వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యమిచ్చినందుకు దక్షిణ జోన్‌లో కేటగిరీ-3 కింద జిల్లాకు ఈ అవార్డు లభించింది. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ చేతుల మీదుగా కలెక్టరు హిమాన్షు శుక్లా అవార్డును అందుకున్నారు. ఆయన వెంట డ్వామా పీడీ గంగాభవాని కూడా ఉన్నారు. జేఎస్‌జేబీ పథకానికి సంబంధించి వర్షపు నీటిని వడిసిపట్టి భూగర్భజలాలను పెంచటంతోపాటు జలసంరక్షణలో కలెక్టరు ఆధ్వర్యంలో డ్వామా అధికారులు పటిష్ఠంగా పని చేశారు. 2024 సంవత్సరంలో జిల్లాలో 856 ఫారం పాండ్స్, 3495 ఇంకుడుగుంతలు, 112 ఊట చెరువులు, 166 చెక్ డ్యాంలు, 512 వాటర్ హార్వెస్టింగ్ పాండ్స్, 247 చెరువుల పూడికతీత పనులు చేపట్టారు. జిల్లాలో మొత్తంగా 5502 భూగర్భ జలాల రీచార్జ్ పనులు పూర్తి చేశారు.

25లోగా 'పది' ఫీజు కట్టాలి

నెల్లూరు(విద్య), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ఫీజును విద్యార్థులు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఆన్‌లైన్‌లో ఈనెల 25వతేదీలోగా చెల్లించాలని డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50ల అపరాధ రుసుముతో ఈనెల 26 నుంచి డిసెంబరు 3వతేదీ వరకు, రూ.200 అపరాధ రుసుముతో డిసెంబరు 4 నుంచి 10 వరకు, రూ.500 అపరాధ రుసుముతో డిసెంబరు 11 నుంచి 15వతేదీ లోపల చెల్లించాలన్నారు. రెగ్యులర్ అభ్యర్థులు అన్ని సబ్జెక్టులకు రూ.125, మూడు సబ్జెక్ట్‌లపైన రూ.125లు, మూడు సబ్జెక్ట్‌ల వరకు రూ.110 చెల్లించాలని తెలిపారు. ఒకేషనల్ అభ్యర్థులు అదనంగా రూ.60లు చెల్లించాలన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో పాఠశాల లాగిన్ నుంచి మాత్రమే ఫీజులు చెల్లించాలని ఆదేశించారు. అండర్ ఏజ్ రిలాక్సేషన్ సర్టిఫికెట్ ఫీజు రూ.300ను కూడా ఆన్‌లైన్‌లో చెల్లించాలని, సీఎఫ్‌ఎంఎస్ ద్వారా, బ్యాంక్ చలాన్లను అంగీకరించరని స్పష్టం చేశారు.

- పీఏటీ పరీక్ష ఫీజు చెల్లించాలి...

గ్రేడ్-2 పండిట్స్, వ్యాయామ ఉపాధ్యాయులకు, క్రాఫ్ట్, డ్రాయింగ్, టైలరింగ్ స్పెషల్ టీచర్లకు జరిగే ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ టెస్ట్(పీఏటీ)కు, గ్రేడ్-1 పండిట్స్‌కు జరిగే సింపుల్ ఒరియంటేషన్ టెస్ట్‌కు ఫీజులు చెల్లించాలని డీఈవో బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26వతేదీ లోగా ఎలాంటి అపరాధ రుసుము లేకుండా రూ.200లు, అపరాధ రుసుము రూ.60లతో కలిపి రూ.260లను డిసెంబరు 4వతేదీలోగా చెల్లించాలన్నారు. www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల 20వతేదీ నుంచి దరఖాస్తు అందుబాటులో ఉంటుందని, దీన్ని పూర్తి చేసిన వారు నగరంలోని దర్గామిట్ట ప్రభుత్వ పరీక్షల విభాగం కార్యాలయంలో అందచేయాలని కోరారు.

- హెచ్‌ఎం అకౌంట్ టెస్ట్‌కు పరీక్ష ఫీజు...

ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ కేటగిరిల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు డిసెంబరులో నిర్వహించే హెడ్‌మాస్టర్ అకౌంట్ టెస్ట్ పేపర్-1, పేపర్-2 పరీక్ష ఫీజును చెల్లించాలని డీఈవో బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. పేపర్-1కు రూ.100లు, పేపర్-2కు రూ.150లను ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈనెల 24వతేదీ లోపల చెల్లించాలన్నారు. రూ.60ల అపరాధ రుసుముతో ఈనెల 30వరకు చెల్లించవచ్చన్నారు. దరఖాస్తులు www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, వీటిని పూర్తిచేసి నగరంలోని దర్గామిట్ట ప్రభుత్వ పరీక్షల విభాగం కార్యాలయంలో అందచేయాలని తెలిపారు.



అన్నదాత భరోసా సుఖీభవ

- మూడు విడతల్లో రూ.14వేల ఆర్థిక సాయం
- జిల్లాలో 1,95,866 మందికి లబ్ధి
- రెండో విడత రూ.5వేల నగదు జమ నేడు..
- పీఎం కిసాన్ రూ.2వేలు కూడా..

నెల్లూరు (వ్యవసాయం), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అన్నదాతకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయి. అప్పులు చేసి వ్యవసాయం చేస్తున్న రైతులకు పెట్టుబడి సాయం చేస్తూ కొంతమేర ఆసరాగా ఉంటున్నాయి. రబీ, ఖరీఫ్ సీజన్ల ప్రారంభంలో రైతులకు అవసరాలకు తగ్గట్టుగా నగదు రైతుల ఖాతాల్లో ప్రభుత్వాలు జమ చేస్తున్నాయి. జిల్లాలో 1,95,866 మంది రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం రెండో విడత నగదుతోపాటు బుధవారం పీఎంకిసాన్ పథకం కింద 21వ విడత నగదు 1,61,358 మంది రైతులకుగాను రూ.2వేల చొప్పున రూ.32.27 కోట్లు జమ అవుతుంది.

- మూడు విడతల్లో రూ.14వేలు

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మూడు విడతల్లో రూ.14 వేలు జమ చేసేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించింది. రూ.5వేల చొప్పున రెండు విడతలుగా అదేవిధంగా మరో విడతలో రూ.4వేలు జమ చేయనుంది. ఇప్పటికే ఆగస్టులో మొదటి విడతగా రూ.5వేలు చొప్పున 1,95,866 మంది రైతుల ఖాతాలకు రూ.97.933 కోట్లు జమ చేసింది. రెండో విడత కింద బుధవారం రూ.97.933 కోట్లు జమ చేయనుంది.

- గతంలో రూ.7500 మాత్రమే..

గత ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద రూ.7500 మాత్రమే అందించేది. రూ.5500, 2వేలు చొప్పున 2 విడతల్లో రైతులకు అందించింది. అయితే టీడీపీ అధినేత చంద్రబాబు అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం రైతులకు పెట్టుబడి సాయం అందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎంకిసాన్ పథకం ద్వారా మూడు విడతల్లో అందించే రూ.6వేలతోపాటు మొత్తం రూ.20వేలు రైతులకు అందుతోంది.

నియోజకవర్గాల వారీగా అర్హుల జాబితా

నియోజకవర్గం	లబ్ధిదారులు	నగదు (రూ.కోట్లు)
ఉదయగిరి	45,275	22.6375
ఆత్మకూరు	34,223	17.1115
కావలి	18,305	9.1525
కోవూరు	16,938	8.469
సర్వేపల్లి	27,958	13.979
నెల్లూరు	5,299	2.6495
వెంకటగిరి	1,6015	8.0075
కందుకూరు	31,853	15.9265
మొత్తం	1,95,866	97.933

ప్రాణం తీసిన సెల్‌ఫోన్

- రైలు ఢీకొని బీటెక్ విద్యార్థిని దుర్మరణం



హవిలా షారూన్ (ఫైల్)

కావలి రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సెల్‌ఫోన్ సంభాషణ ఓ యువతి ప్రాణం తీసింది. మంగళవారం కావలిలోని ఉదయగిరి బ్రిడ్జి కింద ఫోన్‌లో మాట్లాడుతూ పట్టాలు దాటుతున్న ఓ ఇంజనీరింగ్ విద్యార్థినిని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. జీఆర్పీ పోలీసుల కథనం మేరకు.. కొండాపురం మండలం సాయిపేటకు చెందిన పూండ్ల సురేష్, అనితల కుమార్తె హవిలాషారూన్ కావలిలోని విట్స్ కళాశాలలో బీటెక్ 3వ సంవత్సరం చదువుతూ హాస్టల్‌లో ఉంటున్నది. అనారోగ్యం కారణంగా 15 రోజులుగా ఇంటి వద్దే ఉంటూ కళాశాలకు వెళ్తున్నది. మంగళవారం ఉదయం 8.20 గంటలకు ఇంటి నుంచి కళాశాలకు వచ్చింది. బుధవారం పరీక్షలు ఉండటంతో రికార్డులు తీసుకునేందుకు ఫోన్ మాట్లాడుతూ రైలు పట్టాలు దాటుతున్నది. అదే సమయంలో కాన్పూర్ నుంచి బెంగళూరు వెళ్లే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ హవిలా షారూన్‌ను ఢీ కొంది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. లోకో పైలెట్ సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతురాలి వద్ద లభించిన ఆధారాల మేరకు కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న మృతురాలి స్నేహితులు, కుటుంబ సభ్యులు, బంధువులు వైద్యశాలకు చేరుకున్నారు. చేతికి అందివచ్చిన కుమార్తె మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఎస్ఐ వెంకట్రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కలెక్టరేట్‌లో కుప్పలుగా ఫైళ్లు

- వివరాలు 7లో..



'కాశీబుగ్గ' ఘటనలు

పునరావృతం కానీయొద్దు!

తప్పు చేస్తే భగవంతుడు క్షమించడు

రూ.118.5 కోట్లతో 58 ఆలయాల పునఃనిర్మాణం

'కాశీబుగ్గ' తరహా సంఘటనలు జిల్లాలో జరగకుండా ఆలయాల్లో పటిష్ట చర్యలు తీసుకోండి. ఆగమ శాస్త్ర విషయాల్లో వేద పండితులు, అర్చకులే నిర్ణయాలు తీసుకుంటారు. ఇందులో అధికారులు జోక్యం ఉండకూడదు. ఆలయాల్లో తప్పులు చేస్తే భగవంతుడు చూస్తున్నాడనే భయాన్ని కలిగి విధులు నిర్వహించాలి. టీటీడీలో కల్తీ లడ్డూ, పరకామణి సంఘటనలే ఇందుకు ఉదాహరణ. జిల్లాలో 58 ఆలయాలను రూ.118.5 కోట్లతో పునఃనిర్మిస్తున్నాం.

- నెల్లూరులో రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

7

రోజంతా వాన



బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో జిల్లావ్యాప్తంగా మంగళవారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఎడతెరపి లేని వర్షం కురవడంతో రోడ్ల మీద నీరు చేరి, వాహనరాకపోకలకు అంతరాయం కలిగింది. ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సగటు వర్షపాతం 4.3 మి.మీగా నమోదైంది. అత్యధికంగా కొడవలూరులో 24.6 మి.మీ, అత్యల్పంగా అల్లూరులో 1.2 మిమీ వర్షం కురిసింది. నెల్లూరులో రోజంతా వర్షం కురవడంతో నగరవాసులు అసౌకర్యానికి గురయ్యారు. ఉద్యోగులు, విద్యార్థులు, రోడ్డుమార్జిన్ వ్యాపారులు అవస్థలుపడ్డారు. చలి కూడా తోడవడంతో వృద్ధులు, చిన్నారులు ప్రతికూలతను చవిచూశారు. ఉష్ణోగ్రత ఘననీయంగా పడిపోవడంతో గాలిలో తేమ పెరిగి చల్లటి గాలులు వీచాయి.

- నెల్లూరు(హరనాథపురం/సిటీ, ఆంధ్రజ్యోతి)

ఉదయగిరిలో బాలికపై అత్యాచారం

ఉదయగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నమ్మి వెంటవెళ్లిన ఓ బాలికపై యువకుడు లైంగికదాడికి పాల్పడిన సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. దుత్తలూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక 9వ తరగతి చదువుతోంది. వింజమూరు వాసి, హైదరాబాదులో హోటల్ మేనేజ్‌మెంట్ చదువుతున్న సాధిఖ్‌తో ఆ బాలికతో ఏడు నెలలుగా పరిచయం ఉంది. ఈ తరుణంలో ఆదివారం సాధిఖ్ ఆ బాలికను తీసుకుని ఉదయగిరి దుర్గం అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ అత్యాచారం చేసి తిరిగి ఇంటి వద్ద వదిలిపెట్టి వెళ్లిపోయాడు. బాలిక అస్వస్థతకు గురై రక్తస్రావం అవుతుండటంతో తల్లిదండ్రులు ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు సోమవారం తీసుకొచ్చారు. వైద్యులు బాలికకు పరీక్షలు నిర్వహించి అత్యాచారానికి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు వైద్యశాలకు వెళ్లి వివరాలు సేకరించారు. ఈ మేరకు దుత్తలూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

సోమశిలలో 73.829 టీఎంసీల నిల్వ

అనంతసాగరం నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయంలో 73.829 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 6,596 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. దిగువ ఉత్తర కాలువకు 150, పవర్ టెన్నల్ నుంచి డెల్టాకు 2,650, కండలేరుకు 750 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

లెప్రసీ సర్వే తనిఖీ

నెల్లూరు రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : ఇంటింటా నిర్వహిస్తున్న లెప్రసీ సర్వేను జిల్లా లెప్రసీ నివారణ అధికారి ఖాదర్‌వలి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అల్లీపురం పీహెచ్‌సీ పరిధి గుడిపల్లిపాడు నేతాజీనగర్ వద్ద జరుగుతున్న సర్వే ప్రక్రియను పరిశీలించారు. శరీరంపై అనుమానస్పద మచ్చలున్న వారిని గుర్తించాలని, అవసరమైతే వైద్యాధికారికి సిఫార్సు చేయాలని సూచించారు. ఇంటి గోడలపై మార్కింగ్ విషయంలో తప్పిదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ లూసీ, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్‌ఎం రమణమ్మ పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	132
స్కిన్ చికెన్	238
స్కిన్‌లెస్	264

కోడిగుడ్ల ధర (100): 640

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)
ఒక గ్రాము ధర రూ.11.705
వెండి కిలో ధర రూ. 1,57,400
వెండి ఒక గ్రాము రూ.162.40

ఆర్టీసీలో మెగా వైద్య శిబిరం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది కోసం సంస్థ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని ప్రధాన బస్టాండులో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. జీజీహెచ్, మెడికవర్, ఈఎస్‌ఐ, ఎల్‌వీ ప్రసాద్ ఐ హాస్పిటల్, జైభారత్ వైద్యశాల, స్వరూప్ డెంటల్ వైద్యశాలలకు చెందిన డాక్టర్లు పాల్గొన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందించారు. సురేష్‌రెడ్డి మాట్లాడుతూ శిబిరంలో 104 మందికి ఉచితం కళ్ళద్దాలు ఇచ్చారని, 9 మందికి కంటి శస్త్రచికిత్సలు చేయిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్టీసీ జోనల్ ఈడీ నాగేంద్రప్రసాద్, ప్రజా రవాణాశాఖాధికారి షేక్ షమీమ్, అధికారులు పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ నెల్లూరు-1 డిపో పరిధిలో ప్రయాణికులు వారి సమస్యలు, సలహాలు, సూచనలు ఇచ్చేందుకు బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నామని డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రయాణికులు సాయంత్రం 4 నుంచి 5 గంటలలోపు 9959885641 నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

డ్రైన్ నిర్మాణానికి శంకుస్థాపన

నెల్లూరు రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ 12వ డివిజన్ ధనలక్ష్మీపురం వద్ద నూతన డ్రైన్ నిర్మాణానికి టీడీపీ నాయకులు మంగళవారం శంకుస్థాపన చేశారు. 330 మీటర్ల నిర్మాణానికి రూ.31 లక్షల నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పఠాన్ సాబీర్‌ఖాన్, కుంచాల విజయభాస్కర్, చింతారెడ్డిపాళెం సొసైటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మస్తానయ్య, తనుజ పాల్గొన్నారు.

'మా సమస్యలు పరిష్కరించండి'

నెల్లూరు (వైద్యం), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ అధికారులు(సీహెచ్‌వో) ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సీహెచ్‌వోల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాతకు వినతిపత్రం అందించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భాను మహేష్ మాట్లాడుతూ రాత్రి 8 గంటలకు కమ్యూనిటీ హెల్త్ అధికారులు ఎఫ్‌ఆర్ కింద హాజరు వేయాలని ఆదేశాలు జారీ చేయటం సరికాదన్నారు. వేతనాలు సమానంగా ఉండాలని, అద్దె బకాయిలు, కరెంటు బిల్లుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.



వైభవంగా ఇరుముడుల ఊరేగింపు

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలో శివ దీక్ష చేపట్టిన భక్తుల ఊరేగింపు మంగళవారం వైభవంగా జరిగింది. మూలస్థానేశ్వరస్వామి ఆలయం మాజీ చైర్మన్ అల్లూరి గిరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్తీక మాసం ప్రారంభం రోజున వేలాది మంది శివదీక్ష ధరించారు. 30 రోజులు పూర్తయిన సందర్భంగా మంగళవారం ఉదయం రంగనాథస్వామి ఆలయంలో ఇరుముడులు కట్టించుకున్నారు. సాయంత్రం పెన్నా జలాలు, ఇరుముడులతో రంగనాథస్వామి ఆలయంలో పూజలు చేసుకుని మేళతాళాలు, తెనాలి బ్యాండ్ కచేరీ, హర నామ స్మరణతో ఊరేగింపుగా మూలస్థానేశ్వరాలయానికి చేరుకుని ఇరుముడులు సమర్పించారు. బుధవారం తెల్లవారుజామున పెన్నా జలాలు, పాలతో మూలస్థానేశ్వరస్వామికి అభిషేకాలు చేసి, దీక్ష విరమిస్తారు. కాగా, మూలస్థానేశ్వరాలయంలో కార్తీక మాస శివరాత్రి సందర్భంగా మంగళవారం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష పూజలు, ప్రాకారోత్సవం జరిగాయి. అలాగే, మహాత్మాగాంధీనగర్ కృష్ణ మందిరంలోని భవానీ శంకర్ స్వామికి విశేష అభిషేకాలు, పూజలు జరిగాయి. రాజరాజేశ్వరి ఆలయంలో కాత్యాయనీ వ్రతం భక్తిశ్రద్ధలతో జరిగింది.

వంద మహిళా సహకార సంఘాలను ఏర్పాటు చేయాలి

● ఏపీడీడీసీఎఫ్ఎల్ ఓఎస్డీ రమణ

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వంద మహిళా సహకార సంఘాలు ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ డైరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్(ఏపీడీడీసీఎఫ్ఎల్) ఓఎస్డీ డాక్టర్ కేవీ రమణ తెలిపారు. జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయం ఆవరణలోని సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా మహిళా డెయిరీ సహకార సంఘాల కార్యదర్శులకు శిక్షణ జరిగింది. ఆయన మాట్లాడుతూ మహిళా సహకార సంఘాల ద్వారా ఆదాయాభివృద్ధి దిశగా అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో ఏపీడీడీసీఎఫ్ ద్వారా 49 భవనాలను నిర్మించామని, ఆయా గ్రామాల్లో సహకార సంఘాలు ఏర్పాటు చేసి, వాటి ద్వారా భవనాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్థక శాఖ జేడీ రమేష్‌నాయక్, డీడీలు నాగమణి, సోమయ్య, ఏడీ శశిధర్ పాల్గొన్నారు.

ఈవీ చార్జింగ్ స్టేషన్లకు స్థల పరిశీలన

నెల్లూరు(జడ్పీ), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వాహనాలకు సంబంధించి విరివిగా చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు నగరంలో స్థలాలను విద్యుత్‌శాఖ ఎస్‌ఈ రాఘవేంద్రం మంగళవారం పరిశీలించారు. అయన మాట్లాడుతూ జిల్లాలో విద్యుత్ వాహనాల సంఖ్య భారీగా పెరగనుందని, కార్లు, బైక్‌లు ఎక్కువగా అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగా నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రి, టీబీ ఆసుపత్రి ఆవరణలను పరిశీలిచామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు శేషాద్రి బాలచంద్ర, శ్రీధర్, ఏఈలు లక్ష్మీనారాయణ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పరంధామయ్యకు నివాళి

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : దళిత నాయుడు దువ్వూరు పరంధామయ్య వర్థంతి సభ మంగళవారం నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో జరిగింది. అరుంధతీయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కుడుముల సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పరంధామయ్య చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ పాల్గొన్నారు.

మోకాళ్లపై వేడుకుంటున్నాం...

15వ రోజుకు పారిశుధ్య కార్మికుల నిరసన

నెల్లూరు(సిటీ), నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పారిశుధ్య కార్మికులు చేపట్టిన ఆందోళన 15వ రోజుకు చేరింది. నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట మంగళవారం మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు సుధాకర్, వజ్రమ్మ, సునీల్ మాట్లాడుతూ కార్మికులక పదవీ విరమణ ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మరణించిన కార్మికుల వారసులకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని, సమ్మె కాలంలో ఇస్తామన్న జీతాలు వెంటనే కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. కాగా, నగరంలో వర్షం కురుస్తున్నప్పటికీ కార్మికులు ఆందోళన విరమించలేదు.



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న కార్మికులు



దళిత, గిరిజన, మైనార్టీలపై మితిమీరిన దాడులు

● కలెక్టరేట్ ఎదుట సీపీఐ నిరసన

నెల్లూరు (వైద్యం), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : దేశం, రాష్ట్రంలో దళిత, గిరిజన, మైనార్టీలపై దాడులు మితిమీరుతున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి అన్నారు. సామాజిక న్యాయం, ఆత్మగౌరవం అనే అంశంపై సీపీఐ శ్రేణులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశాయి. అనంతరం డీఆర్వోకి వినతిపత్రం ఇచ్చాయి. సాయి మాట్లాడుతూ నేషనల్ క్రైమ్ రికార్డ్సు బ్యూరో- 2023 లెక్కల ప్రకారం కేంద్రంలో 11 ఏళ్ల మోదీ పాలనలో ఎస్సీలపై దాడులకు సంబంధించి 57,789 కేసులు, ఎస్టీలకు సంబంధించి 12,960 కేసులు, మహిళలకు సంబంధించి 4.48 లక్షల కేసులు నమోదుకావటం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో నందిపోగు రమణయ్య, మాలకొండయ్య, షేక్ మున్నా, జిలానీ ఖాన్, వినోదమ్మ, ఆదినారాయణ, లీలాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిగరెట్ తాగితే జరిమానా వేస్తా..!

● బహిరంగంగా పొగతాగుతున్న వ్యక్తికి కమిషనర్ హెచ్చరిక

నెల్లూరు(సిటీ), నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : బహిరంగ ప్రదేశాల్లో సిగరెట్ తాగితే జరిమానా వేస్తా...! నీ వల్ల ఇతరులు ఇబ్బందులు పడాలా...? అంటూ ఓ పొగరాయుడిని కార్పొరేషన్ కమిషనర్ నందన్ హెచ్చరించారు. మంగళవారం పారిశుధ్య పనుల పరిశీలనలో భాగంగా ఆయన ఆత్మకూరు బస్టాండ్ వద్ద తృప్తి క్యాంటీన్‌ను పరిశీలించారు. అక్కడ ఓ వ్యక్తి సిగరెట్ కాలుస్తుండటంతో అతనికి కౌన్సెలింగ్ ఇచ్చారు. దుకాణంలో విక్రయిస్తున్న పొగాకు ఉత్పత్తులను జప్తు చేయాలని, బహిరంగంగా ధూమపానం చేసేవారికి జరిమానా విధించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అపోలో ఆసుపత్రి కూడలి, హరనాథపురం ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. సండేమార్కెట్, ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి వద్ద జరుగుతున్న రోడ్డు పనులను తనిఖీ చేశారు. జనార్దన్‌రెడ్డి కాలనీలో జరుగుతున్న రోడ్డు ఆక్రమణల తొలగింపు పనులను పరిశీలించారు. అనంతరం రెవెన్యూ విభాగంపై సమీక్ష నిర్వహించారు.



ధూమపానం చేసిన వ్యక్తిని హెచ్చరిస్తున్న కమిషనర్ నందన్

అండర్‌పాస్ బ్రిడ్జిపై మంత్రి మాటలు సరికాదు

● మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

నెల్లూరు (వైద్యం), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని చింతారెడ్డిపాళెం జంక్షన్‌లో జాతీయ రహదారిపై అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించాలని తాము కోరుతుంటే రాజకీయాలు చేస్తున్నామని పురపాలక శాఖ మంత్రి నారాయణ అనడం సరికాదని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం విమర్శించారు. మంగళవారం చిల్డ్రన్‌పార్క్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 16న అండర్‌పాస్ బ్రిడ్జి కోసం మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశామన్నారు. ప్రజల మద్దతుతోనే అండర్‌పాస్ బ్రిడ్జికోసం 16 ఏళ్లుగా పోరాటం చేస్తున్నామని చెప్పారు. మంత్రి చెప్పినట్లు మూడు నెలల్లో టెండర్లు పిలిచి ఏడాదిలోపు బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. లేకపోతే ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అండర్‌పాస్ బ్రిడ్జి సాధన కమిటీ కన్వీనర్ కాయం శ్రీనివాసులు, కట్టా సతీష్, జూదాల సుధాకర్, రైతు సంఘం నాయకులు కోటిరెడ్డి, పమిడిమర్రి రామకృష్ణ, బసిరెడ్డి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆర్చరీలో జిల్లాకు ఐదు పతకాలు

నెల్లూరు(విద్య), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నూజివీడులో జరుగుతున్న రాష్ట్ర జూనియర్, సీనియర్ ఆర్చరీ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఐదు పతకాలు సాధించారు. జూనియర్ రికర్వ్ రౌండ్‌లో పీ రాజేష్ స్వర్ణ, ఆర్ సాయిమౌర్య రజత, కే తరుణీష్ జాత్యా కాంస్య పతకాలు సాధించారు. సీనియర్ రికర్వ్ రౌండ్‌లో పీ రాజేష్ స్వర్ణ, ఆర్ సాయి మౌర్య రజత పతకాలు దక్కించుకుని జాతీయ పోటీలకు అర్హత సాధించారు. ఛత్తీస్‌ఘడ్‌లోని రాయపూర్‌లో డిసెంబరు 22 నుంచి 30వతేదీ వరకు జరిగే పోటీలకు జూనియర్ క్రీడాకారులు, తెలంగాణలోని హైదరాబాద్‌లో డిసెంబరు 10 నుంచి 19 వరకు జరిగే పోటీలకు సీనియర్ క్రీడాకారులు హాజరు కానున్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష, పావురాల వేణు అభినందించారు.

జాతీయ స్కేటింగ్‌కు 'మౌంట్ లిటేరా' విద్యార్థులు

నెల్లూరు(విద్య), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మౌంట్ లిటేరా పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న డీ మరీనా, బీ దేవహర్ష జాతీయ స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల కరస్పాండెంట్ యు ధనరాజ్ తెలిపారు. పాఠశాలలో మంగళవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి రోలర్ స్కేటింగ్‌లో జూనియర్ విభాగంలో అత్యుత్తమ ప్రదర్శనతో విజేతలుగా నిలిచి జాతీయ పోటీలకు అర్హత సాధించారన్నారు. డిసెంబరు 5 నుంచి 15వతేదీ వరకు విశాఖలోనే జరిగే జాతీయ పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ జే దినేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల స్థాయి నుంచి గ్రంథాలయాలకు వెళ్లాలి

● జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా పిలుపునిచ్చారు. మంగళవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్, చెస్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాల్లో పుస్తక పఠనంతో పాఠ్యాంశాల్లో లేని ఎన్నో విషయాలు తెలుస్తాయని, తద్వారా ప్రతిభ గల విద్యార్థులుగా రాణిస్తారని ఆయన తెలిపారు. ఈ పోటీలను ఆర్ఎస్ఆర్ స్కూలు హెడ్‌మాస్టర్ సతీష్‌కుమార్, సోషల్ టీచర్ జ్యోతి, సైన్స్ టీచర్ కమల, ఉప గ్రంథ పాలకులు ఎస్ సునీత, కృష్ణయ్య, జితేంద్ర, శశిబాబు తదితరులు పర్యవేక్షించారు.

పురుష మహాశయా.. మీ 'సిత్రాలు' చూసుకోండి!

మనుబోలు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయపురుషుల దినోత్సవం సందర్భంగా బుధవారం ఆసక్తికరమైన చిత్రాలను తెలుగు పండితుడు, సూక్ష్మ చిత్ర కళాకారుడు సోమా పద్మారత్నం బిస్కెట్, తెల్ల కాగితాలపై చక్కగా చిత్రించారు. ఈ కార్వింగ్ చిత్రాల ద్వారా పురుషులకు శుభాకాంక్షలు తెలియజేయడం విశేషం. ఈ సిత్రాలు ప్రత్యేకంగా పురుషులను ఆకట్టుకున్నాయి.



కార్వింగ్ సిత్రం

సీపీఆర్‌పై అవగాహన తప్పనిసరి!



అవగాహన కల్పిస్తున్న రాజేంద్రప్రసాద్

ఇందుకూరుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్‌క్రాస్ ఎంపీ మెంబర్ దాసరి రాజేంద్రప్రసాద్ ఇందుకూరుపేట ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో పల్లిపాడు గాంధీ ఆశ్రమంలో కృష్ణచైతన్య కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు మంగళవారం సీపీఆర్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు, డిజాస్టర్ కో ఆర్డినేటర్ దాసరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కార్డియాక్ అరెస్టు ఎదుర్కొన్న వారిని సకాలంలో కాపాడేందుకు కార్డియోపల్మనరీ రీసటేషన్ (సీపీఆర్) ఉపయోగపడుతుందన్నారు. జిల్లా కో ఆర్డినేటర్ సుందర్‌రాజ్ విద్యార్థులకు సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. కృష్ణచైతన్య కళాశాల ఎన్ఎస్ఎస్ కో ఆర్డి నేటర్ శ్రీహరి, కళాశాల సిబ్బంది అర్చన, రెడ్ క్రాస్ సిబ్బంది డాక్టర్ పురందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే సోమిరెడ్డి రాక

తోటపల్లిగూడూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగే అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ నిధుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి పాల్గొంటారని మండల టీడీపీ అధ్యక్షుడు రఘుబాబు తెలిపారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు సీఎం చేయూత

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక స్వావలంబనకు ముఖ్యమంత్రి చంద్రబాబు తోడ్పాటునందిస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మురళి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మెప్మా అధ్వర్యంలో 72వ అఖిల భారత సహకార వారోత్సవాలలో చైర్‌పర్సన్ పాల్గొన్నారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో సహకార వారోత్సవాలు బుచ్చిలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళలను మెప్మా ఆర్పీలు సంఘాల్లో చేర్చి రుణాలు సద్వినియోగమయ్యేలా బాధ్యత వహించాలన్నారు. సభ్యులకు అందుబాటులో ఉండి పొదుపు సంఘాలలో ఎదురయ్యే సమస్యలను అందరూ కలిసి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, డీసీఓ గురప్ప, తిరు పాల్‌రెడ్డి, సుభాషిణి పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

మహిళా సాధికారతే కూటమి ప్రభుత్వం లక్ష్యమని బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అన్నారు. బుచ్చి మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను మంగళవారం చైర్‌పర్సన్ సందర్శించారు. ప్రజలు స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేయాలని కోరారు. వైస్ చైర్మన్ శివకుమార్‌రెడ్డి, నస్రీన్, సీఓ నర్మద, సంఘాల మహిళలు పాల్గొన్నారు.



మార్కెట్‌ను సందర్శిస్తున్న చైర్‌పర్సన్ సుప్రజ

స్వర్ణ గరుడుడిపై శ్రీవారు

రాపూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నృసింహుని జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం పురస్కరించుకుని మంగళవారం నాడు ప్రత్యేక పూజలు చేసారు. తెల్లవారుజామున శ్రీవారికి చందనాలంకార సేవ, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వర్ణగరుడ వాహనంపై కొలువుదీర్చి ఆస్థానసేవ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఉచిత ప్రసాదాలు, అన్నప్రసాదం అందించినట్లు ఆలయ ఉప కమీషనర్ పొరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.



కుష్టు వ్యాధి సర్వే పరిశీలన

ఇందుకూరుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తూరు రావూరు డొంక ఎస్టీ కాలనీలో కుష్టు వ్యాధి సర్వే ప్రక్రియను మంగళవారం జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఖాదర్‌వలి పరిశీలించారు. ఎస్టీ కాలనీలో సంచార జీవనం సాగిస్తున్న పాత లెప్రసీ వ్యాధిగ్రస్తుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రేషన్‌కార్డు లేనందువల్ల పెన్షన్ రావడం లేదని బాధితుడు తెలపగా, జిల్లా ఐటీడీఏ పీవో మల్లికార్జున, ఎంపీడీవో నాగేంద్రబాబులతో చర్చించారు. ఆయనకు ఆధార్‌కార్డు అందించి, పెన్షన్ వచ్చేలా చూడాలన్నారు. గిరిజన కాలనీలో స్థానికుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల పిల్లల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జగదేవిపేట పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సి కిషోర్ కుమార్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సీహెచ్ సుధాకర్‌రావు, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ జనార్ధన్‌రావు, ఏఎన్ఎం సుజాత, రెసిడెన్షియల్ స్కూల్ పీఈటీ మాధవ, స్టాఫ్ నర్స్ లక్ష్మీ, నేత్రావతి, ఆశా వాలంటీర్‌అనూహ్య తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

రాపూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. విద్యార్థులచే మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ క్రిష్ణవేణి మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజం నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి సాయికిరణ్, అధ్యాపకులు, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

ఐటీడీపీ మండలాధ్యక్షుడిగా శ్రీహరికోట రవిబాబు

విడవలూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కోవూరు ఎమ్మెల్యే గెలుపునకు కృషి చేయడంతో పాటు, సోషల్ మీడియాలో టీడీపీకి సేవలందిస్తున్న రామతీర్థం గ్రామానికి చెందిన శ్రీహరికోట రవిబాబును ఐటీడీపీ మండలాధ్యక్షునిగా సోమవారం టీడీపీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో కష్టపడేవారికి గుర్తింపు ఉంటుందన్నారు. తన ఎంపికకు సహకరించిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, మండల ఇన్‌చార్జ్ అడపాల శ్రీధర్‌రెడ్డి, నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, సత్యవోలు సత్యంరెడ్డి, ఆవుల రవిచంద్రకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు

తోటపల్లిగూడూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశామని ఎంపీడీవో వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. ఈనెల 18 నుంచి 28వ తేదీ వరకు వరిగొండ, నరుకూరు, పేడూరు, తోటపల్లిగూడూరు, జడ్పీ హైస్కూల్, వరకవిపూడి, చెన్నపల్లిపాలెం, పొట్లపూడి పాఠశాలల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

కోవూరులో సహకార సంఘ వారోత్సవాలు

కోవూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాంతినగర్‌లోని పడుగుపాడు సహకార సంఘ కార్యాలయంలో మంగళవారం 72 వ అఖిల భారత సహకార సంఘ వారోత్సవాల్ని డీసీఓ గురప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార రంగ కార్యక్రమాల్ని విస్తరించాలన్నారు. ఒకరి కోసం ఒకరు నినాదాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్ళాలన్నారు. రైతులకే కాకుండా అన్ని వర్గాల వారికి సహకారమందించేందుకు పడుగుపాడు సొసైటీ కృషి చేస్తుండటం అభినందనీయమన్నారు. సమాజానికి ఉపయోగపడుతూ సేవలందిస్తున్న సహకార సంఘ సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో డీసీఈఓ తిరుపాలురెడ్డి, ఎస్డీఎల్‌సీ సుభాషిణి, సొసైటీ చైర్మన్ శ్యామసుందరరెడ్డి, సొసైటీ సీఈఓ గోవర్ధన రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సొసైటీ ఆవరణలో మొక్కల్ని నాటారు. లక్ష్మీపార్వతి వృద్దుల ఆశ్రమంలో దుస్తులు పంపిణీ చేశారు.



మొక్క నాటుతున్న జిల్లా అధికారులు

డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

రాపూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానికంగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 20న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ హనుమంతయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సుల్లో చేరగోరే విద్యార్థినీ, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా మహాదీపారాధన

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప స్వామి దేవస్థానంలో కేరళ సంప్రదాయ మండల పూజలు మంగళవారం జరిగాయి. తొలుత అయ్యప్ప స్వామి వారి నిర్మాల్య దర్శనం, పాలభిషేకం, మహాగణపతి హోమం, స్వామివారికి ఉషఃపూజ, శ్రీవేలి ఉత్సవం, కలశ పూజ, నవకాభిషేకం, ఉచ్చపూజ, శ్రీవేలి ఉత్సవం, సాయంత్రం పూలంగిసేవ దర్శనం, మహా దీపారాధన, భగవతిసేవ, అత్తాళపూజ, శ్రీవేలి ఉత్సవం, పడి కర్పూరదీపం, హరిహరాసనం జరిగాయి.

పోలేరమ్మ ఆలయంలో ఉడిపి పీఠాధిపతి

కోవూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మైథిలి కూడలిలోని పోలేరమ్మ ఆలయాన్ని మంగళవారం ఉడిపి పీఠాధిపతి ఈషాప్రియ తీర్థస్వామి దర్శించి పూజలు చేశారు. పోలేరమ్మ, పోతురాజు విగ్రహాలను గిరిజన కాలనీలో ఇటీవల గిరిజనులు ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. భక్తులు ఆలయానికి చేరుకుని ఆయనకు ఘన స్వాగతం పలికారు. హిందూ ధార్మిక సంస్థ ప్రతినిధి ధన్వి శ్రీనివాసులు పాల్గొన్నారు.



పోలేరమ్మ ఆలయంలో ఈషాప్రియ

పచ్చదనం-పరిశుభ్రతపై దృష్టి పెట్టండి

మనుబోలు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో పచ్చదనం, పరిశుభ్రతపై సర్పంచులు, కార్యదర్శులు, హరిత రాయబారులు దృష్టి సారించాలని రాష్ట్ర సీనియర్ ఫ్యాకల్టీ, శిక్షణ పరిశీలకులు ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పచ్చదనం, పరిశుభ్రతపై శిక్షణ నిర్వహించారు. గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుండాల వజ్రమ్మ, ఎంపీడీవో జల జాక్షి, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, మనుబోలు సర్పంచ్ కంచి పద్మమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పరిశీలకుడు ప్రసాద్

నేడు ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా దర్బార్

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం ఎంపీ డీఓ కార్యాలయంలో బుధవారం 'ప్రజా దర్బార్' నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మంజులమ్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలస్థాయి అధికారులు, గ్రామ పంచాయతీల సెక్రటరీలు పాల్గొనాలన్నారు. ఉదయం బుచ్చి పెద్దూరు వద్ద అగ్నిమాపకశాఖ నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పాల్గొని భూమిపూజ చేస్తారన్నారు. పట్టణంలోని వవ్వేరు బ్యాంకు ఆవరణలో జరిగే 72వ అఖిల భారత సహకార వారోత్సవాలకు కూడా ఎమ్మెల్యే హాజరవుతారని వవ్వేరు బ్యాంకు చైర్‌పర్సన్ దొడ్ల విజయలక్ష్మి, సీఈఓ ఎం శ్రీనివాసులు పేర్కొన్నారు.





ఫైళ్ల విషయమై అధికారులు, సిబ్బందిని ఆదేశిస్తున్న జేసీ వెంకటేశ్వర్లు

కలెక్టరేట్‌లో ఫైళ్ల కుప్పలు..!

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్లను జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు సెక్షన్లలో కుప్పలుగా పడి ఉన్న ఫైళ్లను చూసి అసహనం వ్యక్తం చేశారు. తొలుత ల్యాండ్ సెక్షన్‌కు పరిశీలించారు. అక్కడ ఫైళ్లు చెల్లాచెదురుగా పడి ఉండటం గుర్తించారు. ఆ సెక్షన్ తహసీల్దార్‌ను పిలిచి ప్రశ్నించారు. సెక్షన్‌లో ఉద్యోగుల కుర్చీలు ఖాళీగా ఉండటంపైనా ఆరా తీశారు. డైనింగ్ హాల్ అటకల మీద కుప్పలుగా ఉన్న ఫైళ్లను గుర్తించి వాటిని వెంటనే వేరే చోటికి తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. కలెక్టరేట్‌లో మొత్తం మార్పులు, చేర్పులు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కాగా, నాలుగు రోజుల కిందట కలెక్టర్ హిమాన్షు శుక్లా కలెక్టరేట్‌లోని సెక్షన్లను పరిశీలించినా అధికారులు, సిబ్బంది ఫైళ్లను సక్రమంగా పెట్టకుండా కుప్పలుగా వేయటం విచారకరం. జాయింట్ కలెక్టర్ తనిఖీలతో అయినా సెక్షన్లలో మార్పు వస్తుందేమో చూడాలి!.

కావలి (టౌన్) నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వీఎస్‌యూ పురుషుల అంతర్ కళాశాలల క్రీడాపోటీలు హోరాహోరీగా జరిగాయి. జేబీలోని డీఆర్ క్రీడా ప్రాంగణంలోని ఇండోర్ స్టేడియంలో రెండురోజులపాటు జరిగిన ఈ పోటీలు మంగళవారం ముగిశాయి. ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రసాద్ రెడ్డి నిర్వహణలో పోటీలు జరిగాయి. కావలి జేబీ, వీఎస్‌యూ జట్ల మధ్య జరిగిన ఫైనల్స్‌లో ఎట్టకేలకు జేబీ విజయం సాధించింది. వీఎస్‌యూ రన్నర్‌గా నిలిచింది. నెల్లూరు జెనెక్స్ జేబీ జట్ల మధ్య జరిగిన వాలీబాల్ ఫైనల్స్ లో ఒక్క పాయింట్ తేడాతో నెల్లూరు జెనెక్స్ విజయం సాధించింది. జేబీ రన్నర్‌గా నిలిచింది. ఫుట్‌బాల్ విన్నర్‌గా నెల్లూరు కృష్ణచైతన్య కళాశాల, రన్నర్‌గా జేబీ జట్లు నిలిచాయి. టెన్నిస్ సింగిల్స్‌లో జేబీ విన్నర్‌గా వీఎస్‌యూ రన్నర్‌గా, డబల్స్‌లో జేబీ విన్నర్‌గా, ఎమ్మెస్సార్ రన్నర్‌గా నిలిచాయి. షటిల్ బ్యాడ్మింటన్ సింగిల్స్ విన్నర్‌గా జేబీ, రన్నర్‌గా కృష్ణచైతన్య, డబల్స్ విన్నర్‌గా జేబీ, రన్నర్‌గా కృష్ణచైతన్య జట్లు నిలిచాయి. పోటీల అబ్జర్వర్‌గా రవీంద్రబాబు వ్యవహరించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను వీఎస్‌యూ జట్లకు ఎంపిక చేశారు. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వీఎస్‌యూ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ వెంకట్రాయులు, జేబీ ప్రిన్సిపాల్ సుబ్రమణ్యంనాయుడు పాల్గొని, కప్పులు, మెడల్స్ అందచేశారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఫిజికల్ డైరెక్టర్లు, సీనియర్ ప్లేయర్లు తదితరులు పాల్గొన్నారు.



వీఎస్‌యూ అంతర్ కళాశాల క్రీడల

ఛాంపియన్లు జేబీ, జెనెక్స్, కృష్ణచైతన్య

రైలు ఢీకొని పెన్నాలో పడి ఒకరి మృతి



నెల్లూరు(క్రైం), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలో రైల్వే బ్రిడ్జిపై గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో పెన్నానదిలో పడి గాయాలపాలైన గుర్తుతెలియని వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్‌ఐ ఎన్ హరిచందన సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని నీటి నుంచి బయటకు తీయించారు. 45-50 సంవత్సరాల మధ్య వ్యక్తి మరణించాడని, మృతదేహంపై తెలుపురంగు హాఫ్ హాండ్స్ షర్ట్, పచ్చరంగు డ్రాయర్ ఉన్నాయని తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

అవగాహనలేక.. వినియోగించక!

- మరుగుదొడ్లు ఉన్నా నిరుపయోగమే
- గ్రామాల్లో మరుగు కోసం ఇంకా ఆరుబయటకే..
- పట్టింపులేని అధికారులు

- నేడు అంతర్జాతీయ మరుగుదొడ్ల దినం

ఉదయగిరి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎంత గొప్ప పథకమైనా, అమలులో సరైన పర్యవేక్షణ లేకపోతే ఫలితం ఉండదు. లక్ష్యంపై స్పష్టత కరువై, లబ్ధిదారులకు అవగాహన కల్పించడంలో విఫలమైతే.. లెక్కల్లోనే గొప్ప తప్ప ప్రజలకు ఎలాంటి మేలు జరగదు. అందుకు నిదర్శనమే వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం. స్వచ్ఛాంధ్రలో భాగంగా ఆరుబయట మలవిసర్జనను నిర్మూలించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ. కోట్లు వెచ్చించి అర్హులైన ప్రతిఒక్కరికీ మరుగుదొడ్లు నిర్మించాయి. అయినా నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో మరుగుకు ఆరుబయటకే వెళుతున్నారు. నవంబరు 17న (నేడు) అంతర్జాతీయ మరుగుదొడ్ల దినం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

అవగాహన కల్పించడంలో విఫలం

ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించింది. వాటిని వినియోగించడంలో ప్రజలకు అవగాహన కల్పించే చర్యలు చేపట్టకపోవడంతో విఫలమవుతున్నారనే చెప్పుకోవాలి. ఇప్పటికీ గ్రామాల్లో 40 శాతం మంది ప్రజలు ముళ్లపొదల చాటుకు, వాగులు, వంకల్లోకి మలవిసర్జనకు వెళుతున్నారు. ఆరుబయట మలవిసర్జన వల్ల అనేక అనర్థాలు తలెత్తి వ్యాధుల బారినపడే అవకాశముంది. ప్రజలకు సరైన అవగాహన కల్పించకపోవడంతోనే ఈ దుస్థితి నెలకొంటుందని పలువురు అంటున్నారు. ఉదయగిరిలోని కావలి మార్గంలో గల ఎస్టీ కాలనీలో ఆరేళ్ల క్రితం 50 కుటుంబాలకు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారు. మరుగుదొడ్ల నిర్మాణానికి చేపట్టిన కాంట్రాక్టర్ గుంతలు తవ్వి వరలు దింపి చేతులెత్తేయడంతో అవి అసంపూర్తిగా మిగిలిపోయాయి. కొందరు మాత్రం వారి సొంత నిధులతో మరుగుదొడ్లు నిర్మించుకొన్నారు. అయినా నేటికీ ఆ కాలనీలో పలువురు బహిరంగ మలవిసర్జనకే వెళుతున్నారు.



ఉదయగిరి : తహసీల్దారు కార్యాలయంలో చెత్తాచెదారంతో నిండిన మరుగుదొడ్డి



ఉదయగిరి ఎస్టీ కాలనీలో నిర్మించిన మరుగుదొడ్డి

ప్రభుత్వ కార్యాలయాల్లోనూ అంతే..

మరుగుదొడ్లు వినియోగించాలని ప్రజలకు అవగాహన కల్పించడంలో విఫలమైన అధికారులు, తమ కార్యాలయాల్లోనూ అదే వ్యవహారశైలిని కొనసాగిస్తున్నారు. ప్రధానంగా ఎంపీడీవో, తహసీల్దారు, పంచాయతీ, పంచాయతీరాజ్, ఐసీడీఎస్, ఎంఈవో తదితర కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం ప్రజలు వస్తుంటారు. అయితే వారికి అవసరమైన మరుగుదొడ్లు కార్యాలయాల్లో అందుబాటులో లేకపోవడంతో అత్యవసర సమయాల్లో అవస్థలు తప్పడంలేదు. కొన్ని కార్యాలయాల్లో ఉన్నా వాటిని వినియోగించకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. మహిళల పరిస్థితి ఇక చెప్పాల్సిన అవసరం లేదు. బహిరంగ మూత్ర, మలవిసర్జన నిషేధించాలనే ప్రభుత్వాల సంకల్పం క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా నెరవేరడంలేదు.

పురుషా.. నేను ఉన్నానన్న భరోసా..!

- ఇంటిల్లిపాది కోసం అన్నిటినీ త్యాగం చేస్తూ
- మకుటం లేని మహారాజులా సేవలు
- జిల్లా జనాభాలో మగవారి సంఖ్య ఎక్కువ
- నేడు అంతర్జాతీయ పురుషుల దినోత్సవం

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ సంక్షేమానికి, సమాజ శ్రేయస్సుకు, దేశ సౌభాగ్యానికి బాధ్యతగల తండ్రిగా, అన్నగా, భర్తగా, కొడుకుగా, సమాజానికి సేవ చేసే పౌరుడిగా మగవారు చేస్తున్న సేవలు ఎనలేనివి. పురుషుల త్యాగాలను, కృషిని గుర్తిస్తూ ప్రతి సంవత్సరం నవంబరు 19న అంతర్జాతీయ పురుషుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఐక్యరాజ్య సమితి ఆమోదంతో మొదటగా ట్రినిడాడ్, టొబాగోలో 1999లో ఈ దినోత్సవాన్ని జరిపారు. భారత్‌లో 2007 నుంచి సేవ్ ఫ్యామిలీ ఫౌండేషన్ (ఎస్ఎఫ్ఎఫ్), దాని అనుబంధ సంస్థలు పురుషుల దినోత్సవాన్ని జరుపుతున్నాయి. మగాడిని జీతం లేని రక్షకుడిగా సమాజం పరిగణిస్తోంది. తన కుటుంబ సభ్యుల కోసం వారు చేసే త్యాగాలకు సరైన గుర్తింపు లేదనే వాదనలు ఉన్నాయి. అప్పు చేసైనా తన సంసారాన్ని సాఫీగా నెట్టుకొస్తుంటాడు. అయినా పురుషుల భావోద్వేగాలపై చర్చ అత్యల్పం. చిన్న చిన్న గుర్తింపు మాటలే వారికి కొండంత బలాన్ని ఇస్తాయి. ఉద్యోగానికి వెళ్లి ఇంటికి తిరిగొచ్చిన భర్తను ఆప్యాయంగా పలకరించి భార్య గ్లాసుడు మంచి నీళ్లు ఇచ్చినా, నాన్నా అంటూ బిడ్డలు దగ్గరకు వచ్చినా ఆ భర్త ఆ రోజంతా పడ్డ కష్టాన్ని క్షణాల్లో మరచి పోతాడు. ఇంతటి గొప్ప మనస్సున్న వారు మగమహారాజులు.



పురుషుల దినోత్సవ లక్ష్యం

పురుషుల ఆరోగ్యం, జీవన ప్రమాణాలు మెరుగుపరచటం, లింగ సమానత్వాన్ని ప్రోత్సహించటం, పురుషులు సాధించిన విజయాలను కృషిని గుర్తించాలనే లక్ష్యంతో అంతర్జాతీయ పురుషుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. పురుషులు సమాజానికి, కుటుంబానికి అందించే సానుకూల విలువలను గౌరవించడమే కాకుండా, వారు ఎదుర్కొంటున్న సమస్యలను, వాటి పరిష్కారానికి సూచనలు ఈ దినోత్సవం రోజున చేస్తారు. కాగా, జిల్లా జనాభా 28,34,553 లక్షలు కాగా, వీరిలో పురుషులు 14,36,346 మంది, మహిళలు 13,98,207 మంది ఉన్నారు.

జిల్లాలో స్త్రీ, పురుష జనాభా లెక్కలు ఇలా..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	మొత్తం
కందుకూరు	1,73,227	1,69,982	3,43,209
కావలి	1,51,340	1,55,318	3,06,658
ఆత్మకూరు	1,46,224	1,40,109	2,86,333
కోవూరు	1,61,865	1,69,876	3,31,741
నెల్లూరు సిటీ	1,94,066	1,91,865	3,85,931
నెల్లూరు రూరల్	2,83,556	2,57,134	5,40,690
సర్వేపల్లి	1,55,901	1,56,793	3,12,694
ఉదయగిరి	1,70,167	1,57,130	3,27,297
మొత్తం	14,36,346	13,98,207	28,34,553

తప్పులు చేస్తే భగవంతుడు క్షమించడు

- 'కాశీబుగ్గ' ఘటనలు పునరావృతం కానీయొద్దు
- దేవదాయ శాఖ అధికారులతో మంత్రి ఆనం



నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : దేవాలయాల్లో అధికారులు, సిబ్బంది, అర్చకులు ఎవరైనా తప్పులు చేస్తే ప్రభుత్వం క్షమించినా భగవంతుడు క్షమించడని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో జిల్లాలోని దేవాలయాలపై ఆయా అధికారులతో మంత్రి సమీక్షించి, విలేకరులతో మాట్లాడారు. తప్పులు చేస్తే భగవంతుడు చూస్తున్నాడనే భయాన్ని కలిగి విధులు నిర్వహించాలని సూచించారు. టీటీడీలో కల్తీ లడ్డూ, పరకామణి సంఘటనలు గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ ఆలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు అమలు చేస్తోందని అన్నారు. రాష్ట్రంలోని 27వేల ఆలయాలను ప్రభుత్వం తీసుకుని ప్రతీ ఆలయం బాధ్యతను పర్యవేక్షిస్తోందన్నారు. ప్రైవేటు పరంగా నడుస్తున్న ఆలయాల వివరాలను దేవదాయ శాఖ, కలెక్టర్, ఎస్పీలు స్వీకరించి రికార్డు చేసి ఉంచుకోవాలని ఆదేశించారు. కాశీబుగ్గ తరహా సంఘటనలు జరగకుండా అన్నీ ఆలయాల్లో పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఆగమ శాస్త్ర విషయాల్లో వేద పండితులు, అర్చకులే నిర్ణయాలు తీసుకుంటారని, అధికారులు జోక్యం ఉండదన్నారు. ఆలయాల్లో ఎలాంటి తప్పులు జరిగినా శిక్షలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో 58 ఆలయాలను రూ.118.5 కోట్లతో పునఃనిర్మాణం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కోవూరు జనార్ధన్‌రెడ్డి, తాళ్లూరు గిరినాయుడు, అధికారులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

నేడు రైతులకు నగదు

రెండో విడత అన్నదాత సుఖీభవ కింద జిల్లాలో 1,95,866 మంది రైతులకు రూ.130.29 కోట్లు బుధవారం జమకానుందని మంత్రి ఆనం చెప్పారు. రాష్ట్రంలోని 46.22లక్షల మంది రైతులకు రూ.3077 కోట్లు జమకానుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడప జిల్లా కమలాపురం నుంచి, తమిళనాడులోని కోయంబత్తూరు నుంచి ప్రధాని మోదీ పీఎం కిసాన్ నగదును విడుదల చేయనున్నట్లు చెప్పారు. ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్‌ల కమిటీ సమూదాయంలో నిర్వహించనున్న కార్యక్రమంలో తాను, అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గంలో 34223 మంది రైతులకు రూ.22.95 కోట్లు జమచేయనున్నట్లు చెప్పారు. ఇక చంద్రబాబు పాలనా దక్షతతో విశాఖలో సిఐఐ సమ్మిట్‌తో రాష్ట్రానికి పెట్టుబడులు వరదలా వచ్చాయని చెప్పారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో పీజీఆర్ఎస్‌ను నిర్వహించి మంత్రి ఆనం ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు.

గత ప్రభుత్వంలో మైనింగ్‌లో రూ.లక్షల కోట్ల దోపిడీ

- వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల

రాపూరు (సైదాపురం), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో లక్షల కోట్ల రూపాయలు సంపాదించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మండిపడ్డారు. మంగళవారం సాయంత్రం మండల పరిధిలోని ఒగ్గు కిష్టయ్య, వీబీజే, నరేంద్ర జ్యోషి మైకా మైన్లను ఎమ్మెల్యే రామకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులతో కలిసి గనుల పరిశీలన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రెవెన్యూ అధికారుల అవకతవకలు చాలా ఉన్నాయన్నారు. సిద్దేశ్వర కోన ప్రాంత భూముల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ కార్యక్రమాలు నిర్వహించారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మైనింగ్ డీడీ శ్రీనివాసులు, తహసీల్దార్ సుభద్ర, మండల టీడీపీ అధ్యక్షుడు కొండూరు సుబ్రహ్మణ్యంరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు అమ్మినేని సుబ్రహ్మణ్యం నాయుడు, సర్పంచు నరసరాజు, నాయకులు పాములూరి శ్రీనివాసులు నాయుడు, వేమసాని రమణయ్య నాయడు తదితరులు పాల్గొన్నారు.



కిష్టయ్య మైన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణ

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- నీరు విడుదల చేసిన ఎమ్మెల్యేలు దగుమాటి, కాకర్ల



నీటిని విడుదల చేస్తున్న కావలి, ఉదయగిరి ఎమ్మెల్యేలు దగుమాటి, కాకర్ల

సంగం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కావలి, ఉదయగిరి ఎమ్మెల్యేలు దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి, కాకర్ల సురేష్ పేర్కొన్నారు. మంగళవారం వారు సంగం బ్యారేజ్ కనిగిరి ప్రధాన కాలువ క్రాస్ రెగ్యులేటర్ల వద్ద సోమశిల ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ వేలూరి కేశవ చౌదరితో కలిసి కావలి కాలువ రెగ్యులేటర్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బాణా శ్రీనివాసులురెడ్డి, సొసైటీ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, సాగునీటి సంఘం అధ్యక్షుడు షేక్ బాబు ఎమ్మెల్యేలకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యేలు ప్రత్యేక పూజలు నిర్వహించి కాలువకు నీటిని విడుదల చేశారు. అనంతరం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కావలి కాలువ పూడికతీత పనులకు అడిగిన వెంటనే రూ. 4.5 కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. గత ఏడాది 880 క్యూసెక్కులు నీరు సరఫరా అయిందన్నారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో కాలువల అభివృద్ధికి ఒక్క పైసా ఖర్చు చేసిన దాఖలాలు లేవన్నారు. ప్రతి ఎకరాకు మూడు బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేస్తున్నారన్నారు. రైతులకు టీడీపీ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణారెడ్డి, ఈఈ నాయక్, డీఈ వెంకటరమణ, డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్లు, సాగునీటిసంఘాల అధ్యక్షులు, టీడీపీ సీనియర్ నాయకుడు కర్నాటి రవీంద్రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రాణాంతకం... సీవోపీడీ

- ధూమపానమే ప్రధాన కారణం
- నెలల వ్యవధిలోనే 100 మందికిపైగా మృత్యువాత
- జిల్లాలో 80వేల మందికిపైగా వ్యాధిగ్రస్థులు



నెల్లూరు (వైద్యం), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సీవోపీడీ... తీవ్రమైన ఊపిరితిత్తుల సమస్య. ప్రస్తుతం జిల్లాలో ఎంతో మందిని వేస్తున్న వ్యాధి ఇది. వాతావరణ కాలుష్యానికి తోడు, ఎక్కువగా ధూమపానం వల్ల ఈ వ్యాధి వస్తున్నట్లు నిపుణులు చెబుతున్నారు. ఎంతో మంది వ్యాధిపై అవగాహన లేక, ఉన్నప్పటికీ నిర్లక్ష్యం చేసి చివరికి మరణానికి చేరువవుతున్నారు. జిల్లాలో కేవలం నెలల వ్యవధిలోనే 100 మందికిపైగా సీవోపీడీ వ్యాధితో మృత్యువాత పడ్డారు. కేవలం మూడు నెలల్లో 5 వేల మందికిపైగా ఈ వ్యాధికి గురికావడం ఆందోళన కలిగించే అంశం. అటు ప్రభుత్వం ఇటు స్వచ్ఛంధ సంస్థలు ధూమపానం వల్ల కలిగే అనర్థాలపై జిల్లాలో విస్తృత ప్రచారం చేస్తున్నా వాటికి అలవాటు పడ్డవాళ్లు మాత్రం ఇలాంటి హెచ్చరికలను లెక్కచేయటం లేదు. జిల్లా వ్యాప్తంగా 80 వేల మందికిపైగా వ్యాధిగ్రస్తులు ఉండగా, ఏటా 800 మందికిపైగా ఈ వ్యాధితో మృతి చెందుతున్నారని గణాంకాలు చెబుతున్నాయి. తొలిదశలోనే దీన్ని గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని, వ్యాధి ముదిరితే ఊపిరితిత్తుల మార్పిడి తప్పదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

5 మండలాల్లో కేసులు తీవ్రం...

సీవోపీడీ వ్యాధిగ్రస్తులు జిల్లాలో ఎక్కువగానే ఉన్నారు. ఏడేళ్లక్రితం జిల్లాలో 30 వేల మంది సీవోపీడీ వ్యాధిగ్రస్తులు ఉండగా ఆ సంఖ్య ప్రస్తుతం సుమారు 80 వేలకు చేరింది. ముఖ్యంగా ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, ఆత్మకూరు, మర్రిపాడు తదితర మండలాల్లో ఎక్కువగా ఇప్పటికీ కంటెల పొయ్యి వాడటం వల్ల ఆయా ప్రాంతాల ప్రజలలో ఎక్కువగా ఈ వ్యాధిగ్రస్తులను గుర్తించినట్లు వైద్యులు చెబుతున్నారు. రక్తంలో కార్బన్ డయాక్సైడ్ అధిక స్థాయిలో ఉండటం, గుండె మీద అధిక ఒత్తిడి, అధికంగా ధూమపానం, వాతావరణంలో కాలుష్యం, పరిశ్రమలు వెదజల్లే రసాయనాల కాలుష్యం ఈ వ్యాధికి కారణమవుతున్నాయి.

వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలి



ఊపిరితిత్తులకు సంబంధించి ఏమైనా సమస్య ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే అది ప్రాణాపాయానికి దారితీస్తుంది. దీనికి ప్రధాన కారణం ధూమపానం. వ్యాధి ముదిరితే నయం చేయడం కష్టం. తొలి దశలోనే గుర్తిస్తే మంచి వైద్యాన్ని పొందే అవకాశం ఉంటుంది. కనీసం 6 నెలలకు ఒకసారైనా ఊపిరితిత్తుల పరీక్షలు చేసుకోవాలి.

- డాక్టర్ అరుణ, పల్మనాలజిస్ట్, జీజీహెచ్

నిర్లక్ష్యం వద్దు



సీవోపీడీ వ్యాధిపై నిర్లక్ష్యం వద్దు. లేదంటే వ్యాధి తీవ్రంగా మారి ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుంది. వ్యాధిగ్రస్తులు వైద్య నిపుణులను కలిసి ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకుంటూ చికిత్సలు చేయించుకోవాలి. సీవోపీడీ వ్యాధిగ్రస్తుల సంఖ్య జిల్లాలో పెరుగుతూనే ఉంది.పరిశ్రమలలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా పనిచేసే వారికి ఆయా పరిశ్రమల కాలుష్యం వల్ల ఈ వ్యాధి వస్తుంది. దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాము.

- డాక్టర్ పోకల రవి, పల్మనాలజిస్ట్, డెల్టా ఆసుపత్రి

రైతులకు అందుబాటులో యూరియా

ఉలవపాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రబీలో సాగు చేసే పంటలకు అవసరమైన యూరియా అన్ని రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉందని మండల వ్యవసాయశాఖ అధికారి డీ.విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని మన్నేటికోట, ఆత్మకూరు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికంగా సాగు చేసే వాణిజ్య పంటల సస్య రక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ, వీహెచ్‌ఏ అజయ్, ప్రియాంక రైతులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	132
స్కిన్ చికెన్	238
స్కిన్‌లెస్	264

కోడిగుడ్ల ధర (100) : 640

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)
ఒక గ్రాము ధర రూ.11.705
వెండి కిలో ధర రూ. 1,57,400
వెండి ఒక గ్రాము రూ.162.40

ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల రక్తదానం



అల్లూరు : రక్తదానం చేస్తున్న రామకృష్ణ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

అల్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1 శిబిరంలో మంగళవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. నెల్లూరు రెడ్ క్రాస్ సంస్థ మోటివేటర్ బీ.భాస్కర్ ఆధ్వర్యంలో రక్తాన్ని సేకరించారు. ఆయన మాట్లాడుతూ యర్రపుగుంటలో నిర్వహించిన ఈ క్యాంపులో తలేమియా వ్యాధిగ్రస్థులకు రక్త అవసరాలను తీర్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సుధీర్ సింగ్, మల్లికార్జునరెడ్డి, ఆధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండాపురం : రక్తగ్రూపును తెలుసుకోవడం ప్రతిఒక్కరి బాధ్యతని నేకునాంపేట జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీవీ. రమణ పేర్కొన్నారు. లైఫ్‌లైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాలలోని విద్యార్థులకు రక్త వర్గ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నవీన్ మాట్లాడుతూ రక్త వర్గాన్ని నిర్ధారణ చేయించుకోవడం వల్ల ఆపదలో ఉన్న వారికి అత్యవసర సమయంలో రక్తం దానం చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సాయిపేట క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు రామమోహనరావు, కొండాపురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాధాక్రిష్ణ, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పద్మ, వెంకటేష్ పాల్గొన్నారు.

దొరికిన చైన్ పోలీసులకు అప్పగింత



దొరికిన బంగారం చైన్‌ను ఎస్‌ఐ శివనాగరాజుకు అందజేస్తున్న సువార్తమ్మ

కందుకూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోస్టాఫీసు సెంటర్‌లో సోమవారం సాయంత్రం దొరికిన బంగారం చైనును ఓ మహిళ మంగళవారం పోలీసులకు అప్పగించి తన నిజాయితీని చాటుకుందని పట్టణ ఎస్‌ఐ శివనాగరాజు తెలిపారు. ఆయన తెలిపిన సమాచారం ప్రకారం గుడ్లూరు మండలం చిమిడితపాడుకి చెందిన గద్దె సువార్తమ్మకు సోమవారం సాయంత్రం నాలుగుగంటల ప్రాంతంలో సుమారు ఒకటిన్నర సవర్ల ఓ బంగారం చైను దొరికింది. ఆమె ఆ చైనును పోలీసులకు అప్పగించారు. చైను పోగొట్టుకున్న వారు ఎవరైనా తమను సంప్రదించాలని అందించిన సమాచారంతో బాధిత మహిళ మంగళవారం పోలీసుస్టేషన్‌కు రాగా ఆమె చెప్పిన వివరాలు సరిపోలటంతో ఆ చైనును బాధితురాలికి ఎస్‌ఐ అందజేశారు. చైను పోగొట్టుకున్న గంగోలు లక్ష్మీప్రసన్నది కూడా గుడ్లూరు మండలం చిమిడితపాడు. ఆమె సోమవారం సాయంత్రం కందుకూరు వచ్చి బస్సు దిగిన కొద్దిసేపటి తర్వాత తన మెడలో చూసుకోగా బంగారం చైను లేనివిషయం అర్థమైందని వివరించారు.

విట్స్‌లో పారిశ్రామికవేత్తల దినోత్సవం

కావలి (టౌన్), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం జాతీయ పారిశ్రామిక వేత్తల దినోత్సవం జరిగింది. చవేరా గ్రూప్స్ అధినేత చెన్నా వెంకటరామయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యువత పారిశ్రామిక రంగంలో ఆసక్తి కనబరచాలని, నూతన ఆలోచనలతో కూడిన ఆవిష్కరణలకు నాంది పలకాలన్నారు. టెక్నాలజీతో కూడిన పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలన్నారు. జలదంకి యూనియన్ బ్యాంక్ మేనేజర్ రామకృష్ణయ్య మాట్లాడుతూ గతంలో పరిశ్రమలు స్థాపించాలంటే పెట్టుబడుల సమస్య తీవ్రంగా ఉండేదని, ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని ప్రభుత్వరంగ సంస్థలు వినూత్న ఆలోచనలతో ముందుకొచ్చి యువత పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు రుణం అందిస్తున్నాయన్నారు. సీనియర్ యూనియన్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దేందుకు ఉన్నత విద్యకు రూ.40లక్షల వరకు రుణాలు అందిస్తున్నామన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ అనీల్‌కుమార్ చెన్నా వెంకటరామయ్యను సత్కరించారు. విట్స్ ఛైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్‌లు ప్రత్యూషారెడ్డి, లిఖిత్‌రెడ్డిలు నిర్వాహకులను అభినందించారు.

అల్లూరులో వణికిస్తున్న చలి

అల్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడనం కారణంగా వాతావరణం చలిగా మారింది. రెండు రోజులుగా విపరీతమైన చలిగాలుల కారణంగా ప్రజలతోపాటు మూగజీవాలు వణికిపోతున్నాయి. మరో వారం రోజులు ఇదే వాతావరణం కొనసాగుతుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

నిత్యావసరాల పంపిణీ

అల్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌కు ఇబ్బందులు పడిన గిరిజనులకు ఏఆర్‌డీ సంస్థ సమకూర్చిన నిత్యావసర సరుకులను మంగళవారం ఇస్కపల్లి పంచాయతీ జవ్వాగు లక్ష్మీపురంలో పంపిణీ చేశారు. స్థానిక టీడీపీ నాయకులు దానం రజిని బాధితులకు దుప్పట్లు, టార్పాలిన్ పట్టలను అందచేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో మల్లికార్జున, సచివాలయ సిబ్బంది హరికృష్ణ, మల్లికార్జున, సంస్థ సిబ్బంది ఏడుకొండలు, అరుణ, కీర్తి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు

కావలి రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): టూరిస్ట్ బస్సుల నిర్వాహకులు నిబంధనలు పాటించకుంటే కఠినచర్యలు తీసుకుంటామని ఆర్టీవో పీ. మురళీధర్ పేర్కొన్నారు. కావలి మండలం రుద్రకోట ఆర్టీవో కార్యాలయంలో మంగళవారం పట్టణంలోని టూరిస్ట్ బస్సుల యజమానులు, డ్రైవర్లకు అగ్నిప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్టీవో మాట్లాడుతూ టూరిస్ట్ బస్సుల్లో అగ్ని ప్రమాదాల నియంత్రణ కిట్‌లతో పాటు మెడికల్ కిట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. శబరిమల యాత్రకు వెళ్లేటప్పుడు బస్సుల్లో గ్యాస్ సిలిండర్లు, పెట్రోల్, పేలుడు పదార్థాల వంటివి పెట్టుకుని వెళ్లరాదన్నారు. బస్సుల్లో ఎమర్జెన్సీ డోర్లు పనిచేసేలా చూసుకోవాలన్నారు. అనంతరం టూరిస్ట్ బస్సులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ సుందరరావు, అసిస్టెంట్ ఎంవీఐలు కరుణాకర్, లక్ష్మీభాయ్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి): సమగ్ర సస్యరక్షణ చర్యలతో పైర్లను కాపాడుకోవచ్చని ఏవో శేషారెడ్డి తెలిపారు. మండలంలోని శామీరపాలెంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా కందిపంటను పరిశీలించారు. అన్నదాత సుఖీభవ రెండో విడత, పీఎం కిసాన్ నిధులు బుధవారం విడుదల చేయనున్నట్లు తెలిపారు.

డిగ్రీలో స్పాట్ అడ్మిషన్

కందుకూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం స్పాట్ అడ్మిషన్లు ప్రారంభం అయ్యాయని ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

జనగణనలో కులగణన చేపట్టాలని ధర్నా



కందుకూరు :సబ్ కలెక్టరు కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు



కావలి : ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ, అనుబంధ సంస్థల నేతలు

కావలి, నవంబరు18(ఆంధ్రజ్యోతి) జనగణనలో కులగణన చేపట్టాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు దామా అంకయ్య కోరారు. ఈ మేరకు మంగళవారం ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఐ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం అంకయ్య మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోదీ అధికారం చేపట్టిన ఈ 11 ఏళ్ల కాలంలో దళిత,గిరిజ మైనార్టీ వర్గాలపై దాడులు పెరిగి పోయాయన్నారు. మోదీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రక్షణ కరువైందన్నారు. తెలంగాణా మాదిరిగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు స్థానిక సంస్థలలో సీట్లు కేటాయిస్తూ అసెంబ్లీలో బిల్లు ఆమోదించినట్లుగానే ఏపీలో కూడా కులగణన చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి, సీపీఐ నేతలు కొప్పర్తి నాగరాజు, ఎస్‌డీ సిరాజ్, షాన్వాజ్,కొండలరావు, షాజహాన్, బోస్, నరసింహ, ఏఐటీయూసీ నాయకులు వై. రవి తదితరులు పాల్గొన్నారు.

● **ఆత్మకూరు :** జనగణనలో కులగణన చేపట్టాలని మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి యామాల మధు మాట్లాడుతూ ప్రధాని మోదీ అధికారం చేట్టిన తరువాత దళిత, గిరిజన, మైనార్టీ వర్గాలపై దాడులు పెరిగిపోయాయన్నారు. కులాల ప్రాతిపదికన బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్లు కేటాయించాలని అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి జంగం నాగరాజు, నాయకులు చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

● **కందుకూరు :** దేశంలో సామాజిక న్యాయం, సమానత్వ సాధన, ఆత్మగౌరవంకోసం జనగణనతోపాటు కులగణన కూడా చేపట్టాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సబ్‌కలెక్టరు కార్యాలయంవద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ అధికారం చేపట్టాక దళిత, గిరిజన, మైనారిటీలపై దాడులు మితిమీరిపోతున్నాయన్నారు. మతోన్మాద పాలన సాగుతోందని విమర్శించారు. దీన్ని ఐక్యంగా ఎదుర్కోవాలని కోరారు. అనంతరం సబ్ కలెక్టరు కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వై. ఆనంద్ మోహన్, ఉప్పుటూరి మాధవరావు, చేవూరి దుర్గాప్రసాద్, కలవకూరి హరిబాబు, బొల్లోజుల బాలబ్రహ్మాచారి, కోటేశ్వరరావు, సుభాను తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కావలి, నవంబరు18(ఆంధ్రజ్యోతి): వివిధ వ్యాధులపై చికిత్స పొంది, ఆర్థిక ఇబ్బందులు పడుతున్న 41 మందికి రూ.27,28,936 విలువైన చెక్కులను టీడీపీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి లబ్ధిదారులకు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోనే సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీలో కావలి ముందంజలో ఉందన్నారు. చంద్రబాబు పాలనలో వర్షాలు సమృద్ధిగా కురిసి,రాష్ట్రం రామరాజ్యాన్ని తలపిస్తోందన్నారు.

● **బాధిత కుటుంబాలకు పరామర్శ**

దగదర్తి (బిట్రగుంట) : దగదర్తి మండలంలోని పలు టీడీపీ కుటుంబాలను ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి మంగళవారం పరామర్శించారు. ముందుగా ఐతంపాడు కొత్తూరులో ఇటీవల అనారోగ్యంతో మృతి చెం దిన అలవల రత్నమ్మ కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మనుబోలుపాడు టీడీపీ నేత దగుమాటి నాగరాజురెడ్డి తల్లి హజరమ్మ ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబాన్ని, కామినేనివారిపాలెంలోని టీడీపీ నేత వంకరదారి రత్నం తమ్ముడు వేణు మృతి చెందగా, ఆ కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులకు తోడుగా ఉంటానని ఆయన తెలిపారు. ఆయన వెంట టీడీపీ నేతలు పమిడి రవికుమార్ చౌదరి, జలదంకి శ్రీహరినాయుడు, తాళ్లూరు సుధాకర్ నాయుడు, కండ్లగుంట మధుబాబునాయుడు, చేజర్ల ప్రభాకర్‌రెడ్డి. వెంకటరత్నం, అల్లంహనుమంతరావు తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పల పడిపూజ

బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం ద్వారకనగరులోని షిరిడి శేషసాయి మందిరంలో మంగళవారం అయ్యప్పస్వామి భక్తుల పడిపూజను వైభవంగా నిర్వహించారు. మందిర ఆవరణంలోని కల్యాణమండపంపై అయ్యప్ప చిత్రపటాన్ని ఏర్పాటు చేసి, పూజ చేశారు.

ఎన్జీవో ఎన్నికలకు నోటిఫికేషన్

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): తాలుకా ఏపీ ఎన్‌జీవో కార్యవర్గం ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ఆ సంఘ కార్యవర్గ సభ్యుడు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత కార్యవర్గ పదవీకాలం ఈనెలలో ముగియనుండడంతో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకొనేందుకు నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. ఈనెల 21న నామినేషన్ల దాఖలు, అదే రోజు ఫలితాలు వెల్లడిస్తారన్నారు. ఎన్నికల అధికారిగా కావలి తాలుకా అధ్యక్షుడు ఎస్.శివకుమార్‌ను నియమించారు.

అబద్ధాలు ప్రచారం చేస్తే పరువు నష్టం దావా వేస్తా : ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో తన రియల్ ఎస్టేట్ వ్యాపారానికి సంబంధించి జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, వాస్తవాలు తెలుసుకోకుండా అసత్యాలు ప్రచారంచేస్తే పరువునష్టం దావా వేస్తానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ అనుమతులు ఇచ్చాకే లేఅవుట్లు వేశామని, అయితే ప్రభుత్వ భూమిని ఆక్రమించి విల్లాలు నిర్మించినట్లు అసత్యప్రచారం చేస్తున్నారన్నారు.గత 25 ఏళ్లుగా హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఉన్న తాను సుమారు 100 ఎకరాల్లో లేఅవుట్లు వేశానని, అన్నీ నిబంధనల ప్రకారమే చేశాను తప్ప.. ఎక్కడా తప్పటడుగు వేయలేదన్నారు. కందుకూరు అభివృద్ధి కోసం తాను చేస్తున్న ప్రయత్నానికి ఎవరు సలహాలు ఇచ్చినా తీసుకుంటానన్నారు. పట్టణంలో రోడ్ల విస్తరణ, డివైడర్ ఏర్పాటు, సెంట్రల్ లైటింగ్ పనులు సంక్రాంతి నాటికి పూర్తి చేస్తామన్నారు. కాగా నియోజకవర్గంలోని 39మందికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ. 26.73 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే ఇంటూరి అందచేశారు.

ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన

ఏఎస్ పేట, నవంబరు 18 (ఆంధ్ర జ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలులో గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మంగళవారం నిర్వహించిన పుస్తక ప్రదర్శన ఆకట్టుకుంది. గ్రంథాలయ అధికారి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో జనరల్ నాలెడ్జ్, సైన్స్, వ్యక్తిత్వ వికాసం, బాల సహిత్యం, మహనీయుల జీవిత చరిత్రలు తదితర పుస్తకాలను ప్రదర్శించారు. విద్యార్థులచే పుస్తక పఠనం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రుక్మిణి, నాణేల సేకరణకర్త ఎండీ వాయిజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మంత్రి ఆనం పర్యటన

ఆత్మకూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మంత్రి ఆనం రామనారాయణరెడ్డి బుధవారం ఆత్మకూరులో పర్యటించనున్నారు. ఉదయం మినీ బైపాస్ రోడ్డు పనులను పరిశీలించి, క్రీడా వికాస కేంద్రం ప్రాంగణాన్ని సందర్శిస్తారు. రక్షిత మంచినీటి పథకం వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వద్ద నీటి సరఫరాను పరిశీలించిన అనంతరం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తారు. మధ్యాహ్నం శ్రీధర్ గార్డెన్స్‌లో రెండో విడత అన్నదాత సఖీభవ - పీఎం కిసాన్ పథకం జిల్లా స్థాయి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ప్రభుత్వం జిల్లాలో 1.96 లక్షల మంది రైతులకు రూ. 1.20 కోట్లు రైతులకు జమ చేయనున్నట్లు ఒక ప్రకటనలో అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొననున్నారు.

నేడు ఎమ్మెల్యే కురుగొండ్ల రాక

కలువాయి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 'పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ' నిధులను బుధవారం ప్రభుత్వం రైతుల ఖాతాలో జమ చేయనున్నారు.ఈ నేపథ్యంలో స్థానిక ఉమామహేశ్వరి కల్యాణ మండపంలో జరిగే కార్యక్రమంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పాల్గొంటారని మండల టీడీపీ కన్వీనర్ చల్లా రఘురామిరెడ్డి తెలిపారు. కలువాయిలో నిర్వహించే రైతు ర్యాలీని మండలంలోని రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పచ్చదనం-పరిశుభ్రతపై అవగాహన

సంగం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీల సుస్థిరాభివృద్ధి, పచ్చదనం, పరిశుభ్రతపై సర్పంచులు, కార్యదర్శులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో షాలెట్ గాంధీజీ, అంబేడ్కర్ చిత్ర పటాలకు పూల మాలల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సురేష్ కుమార్, మండల అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మొక్కుబడిగానే క్లీన్ అండ్ గ్రీన్ శిక్షణ



శిక్షణకు హాజరైన పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ప్రారంభమైన క్లీన్‌అండ్‌గ్రీన్ విలేజ్ (థీమ్-5) శిక్షణ తొలిరోజు మొక్కుబడిగానే సాగింది. ఎంపీడీవో రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణకు పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది మాత్రమే హాజరయ్యారు. 24 మంది సర్పంచులకుగానూ ఇద్దరే హాజరయ్యారు. ఈ తరుణంలో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించడం సాధ్యమేనా ? అన్న అనుమానాలున్నాయి. తొలుత అంబేడ్కర్, గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శిక్షణ ప్రారంభించారు.

సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఇంద్రసేనారెడ్డి

ఉదయగిరి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సెల్‌ఫోన్ వినియోగానికి దూరంగా ఉండాలని ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థులకు అధికంగా సెల్‌ఫోన్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు పెరిగిపోయాయన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌లో పంపే లింకులను ఓపెన్ చేయరాదన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంకు మేనేజర్ జయదేవ్, ప్రిన్సిపాల్ భాస్కర్, కరస్పాండెంట్ మైనుద్దీన్ పాల్గొన్నారు.

ఆయకట్టు పరిధిలో అభివృద్ధి పనులు



కట్టలపై పెరిగిన ముళ్లచెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

ఉదయగిరి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం జలాశయం ఆయకట్టు పరిధిలోని అధికారులు మంగళవారం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జలవనరుల శాఖ డీఈ కందుకూరి చంద్రమౌళి, జలాశయ చైర్మన్ అడుసుమల్లి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ జలాశయం అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.74 లక్షలు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో జలాశయ ఆవరణలోని కట్టపై పేరుకుపోయిన చెట్లను ఎక్స్‌కవేటర్‌తో తొలగించడంతోపాటు కాలువల్లో పూడికతీత, పిచ్చిమొక్కల తొలగింపు చేపట్టామని తెలిపారు. అలాగే కాలువల ట్రాక్‌పై ఏపుగా పెరిగిన కంపచెట్లను సైతం తొలగించామన్నారు. నెలాఖరుకు పనులు పూర్తి చేసి డిసెంబరు 5న సాగునీరు విడుదల చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈలు వేణు, సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ సంప్రోక్షణ



అయ్యప్పస్వామి విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న మన్నేటి వెంకటరెడ్డి దంపతులు

ఉదయగిరి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిరెడ్డిపల్లిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, శ్రీలక్ష్మీ దంపతులు, అయ్యప్ప సేవ సమాజానికి అందించిన పంచలోహ విగ్రహానికి మంగళవారం సంప్రోక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి గణపతి పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, కలశస్థాపన, పంచామృతాభిషేకం, హోమం, పూర్ణాహుతి, సంప్రోక్షణ నివేదన, నీరాజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మన్నేటి దంపతులు, అయ్యప్పభక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం పంచలోహ విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పలు మండలాల అయ్యప్ప భక్తులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వింజమూరు : వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

వింజమూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలను నిర్వహించారు. గ్రంథాలయాధికారి జ్యోతి కొండయ్య ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పోటీ పరీక్షల పట్ల ఆసక్తిని కలిగించేలా, తద్వారా వారిలోనే ప్రతిభను బయటకు తీయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

● **అనంతసాగరం :** స్థానిక గ్రంథాలయంలో మంగళవారం 8, 9 తరగతుల విద్యార్థులకు వివిధ సబ్జెక్టుల్లో ప్రతిభ పరీక్ష నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు నారాయణరావు, ఉపాధ్యాయులు అల్లాబక్ష్ పాల్గొన్నారు.

●**దుత్తలూరు(ఉదయగిరి) :** దుత్తలూరు శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి సునీల్‌కుమార్ మాట్లాడుతూ 58వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు ముగింపు రోజు బహుమతులు అందచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

'పది'లో నూరు శాతం ఫలితాలు సాధించాలి

దుత్తలూరు(ఉదయగిరి), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వసతిగృహ విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించేలా వార్డెన్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమాధికారిణి కె.శోభారాణి ఆదేశించారు. మంగళవారం మండలంలోని నర్రవాడ ఎస్సీ బాలుర వసతిగృహాన్ని ఏఎస్‌డబ్ల్యూవో కొండ్రెడ్డి రమణారెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధకనపర్చడంతో పాటు రుగ్మతలతో బాధపడే వారికి వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించడంతోపాటు నిత్యావసర వస్తువులు, వసతిగృహ పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ రామ్మూర్తి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు సర్వే పక్కాగా నిర్వహించాలి

ఉదయగిరి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం పీహెచ్‌సీ పరిధిలో చేపడుతున్న కుష్ఠువ్యాధిగ్రస్థుల గుర్తింపు సర్వేను వైద్యఆరోగ్య సిబ్బంది పక్కాగా నిర్వహించాలని వైద్యాధికారి శివకల్పన పేర్కొన్నారు. మంగళవారం ఆమె మండలంలో జరుగుతున్న సర్వే పరిశీలించి సిబ్బందికి సలహాలిచ్చారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పక్కన చెత్త వేస్తే జరిమానా

సీతారామపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రతీ షాపు వారు చెత్తను, ప్లాస్టిక్‌ను రోడ్డు పక్కన వేస్తే, జరిమానా విధిస్తామని డిప్యూటీ ఎంపీడీవో శివప్రసాద్ అన్నారు. సీతారాముపుర బస్టాండ్ సెంటర్, రజక కాలనీ,మారంరెడ్డి పల్లి సొసైటీ సమీపంలో నిర్వహించిన పారిశుధ్య పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో పారిశుధ్య పనులు నిర్వహించాలని, రోడ్ల పై నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.కచ్చా డ్రైనేజీలను శుభ్రం చేయించాలని, రోడ్ల పక్క చెత్తాచెదారాలను తొలగించి, బ్లీచింగ్ చల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పిడుగు రవీంద్ర ,పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

గణిత సామర్థ్యాల్లో విద్యార్థులు రాణించాలి



విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో మస్తాన్‌వలి

సీతారామపురం,నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : తెలుగు, గణిత సామర్థ్యాలలో విద్యార్థులు బాగా రాణించాలని ఎంఈవో షేక్ మస్తాన్‌వలి అన్నారు.ఆయన మండల పరిధిలోని గంగవరం , నెమళ్లదిన్నె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను మంగళవారం సందర్శించి, విద్యార్థుల మూల్యాంకన పుస్తకాలను పరిశీలించారు.అలాగే విద్యార్థుల రాత అంశాలను పరిశీలించారు.అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జన్యాల వెంకటేశ్వర్లు, పామనబోయిన బాలకృష్ణ, సురేష్, సీఆర్‌పీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు దుకాణాలకు వేలం

ఉదయగిరి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వింజమూరులోని లక్ష్మీప్రియ థియేటర్ ఎదురుగా ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్మించిన రెండు గదులను అద్దెప్రాతిపదికన ఇచ్చేందుకు వేలం ద్వారా గిరిజనుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో బీ.శ్రీనివాసులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం నెల్లూరు కొండాయపాళెంగేటు దగ్గర గల ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కార్యాలయ ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. ఉదయగిరి మండలంలోని గిరిజనులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 90003 49106 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించాలి

ఉదయగిరి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రైతులు పంటల సాగులో రసాయనిక ఎరువులు వినియోగాన్ని తగ్గించాలని మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్ తెలిపారు. మంగళవారం మండలంలోని వెంగళరావునగర్, ఉదయగిరి-2 రైతుసేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంటల సాగుకు ముందు ప్రతి రైతు విత్తనశుద్ధి చేపట్టాలన్నారు. పంట మార్పిడి విధానాన్ని పాటించాలన్నారు. అనంతరం సాగులో ఉన్న పైర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దీక్షారంభం ప్రారంభం

ఉదయగిరి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి గౌతంరెడ్డి వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ(హన్స్) వ్యవసాయంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు మంగళవారం దీక్షారంభం కార్యక్రమాన్ని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జీ.కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయం నిధుల ద్వారా 2019 నుంచి ఈ కార్యక్రమం అమలు చేస్తున్నామన్నారు.



రాత్రి.. హంస వాహనంపై వీణాపాణిగా



ఉదయం.. వర్షంతో ఘటాటోపం కింద పెద్దశేష వాహనంపై ఊరేగుతున్న అమ్మవారు

పడగలు ప్రణమిల్లి.. పద్మావతి శోభిల్లి

● హంస వాహనంపై జ్ఞానప్రదాయని

తిరుచానూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం పెద్ద శేష, హంస వాహన సేవలు జరిగాయి. ఉదయం శంఖు, చక్ర, గదాధారి అయి పరమపద వైకుంఠనాథుడి రూపంలో అమ్మవారు పెద్దశేష వాహనంపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను సాక్షాత్కరించారు. గంటకుపైగా చిరుజల్లుల మధ్య.. ఘటాటోపం కింద పెద్దశేషవాహనసేవ సాగింది. మధ్యాహ్నం స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహించారు. రాత్రి వీణాపాణిగా హంసవాహనంపై జ్ఞానప్రదాయిని భక్తులకు దర్శనమిచ్చారు. వాహన సేవల ముందు సాంస్కృతిక కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆయా కార్యక్రమాల్లో జీయర్‌స్వాములు, టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు

● బ్రహ్మోత్సవాల్లో నేడు
ఉదయం ముత్యపుపందిరి వాహనం
రాత్రి సింహ వాహన సేవ

నేడు 'అన్నదాత సుఖీభవ'

● 1,54,908 మంది రైతులకు జమకానున్న రూ.104 కోట్లు

తిరుపతి(కలెక్టరేట్/ఎంఆర్‌పల్లె), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రెండో విడత అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు బుధవారం నగదు జమ కానున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. 'జిల్లాలో 1,54,908 మంది రైతులకు రూ.104కోట్లు జమ కానుంది. పీఎం కిసాన్ నగదు జమను ప్రధాని మోదీ.. అన్నదాత సుఖీభవ నగదు జమను సీఎం చంద్రబాబు ప్రారంభిస్తారు. రైతు సేవా కేంద్రాల్లో రైతులు ఈ కార్యక్రమాలను వీక్షించేలా చర్యలు తీసుకోవాలి. జిల్లాలో 8వేల టన్నుల యూరియా నిల్వ ఉంది. ఎకరాకు మూడు బస్తాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది' అని అన్నారు.

అరణియార్ గేట్లు ఎత్తివేత



పిచ్చాటూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరులోని అరణియార్ పూర్తిస్థాయి నీటిమట్టం 31 అడుగులు. మంగళవారం సాయంత్రానికి 30.3 అడుగులకు నీరు చేరుకుంది. దీంతో ముందు జాగ్రత్తగా సాయంత్రం 6 గంటలకు ఒక గేటు పైకి ఎత్తి 200 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. నదీపరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఈ కోరారు.

వరదయ్యపాళెంలో 114.4 మి.మీ. వర్షం

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో వర్షం పడిది. మంగళవారం ఉదయం 8.30గంటలకు నమోదైన వర్షపాతం వివరాలిలా.. వరదయ్యపాళెంలో 114.4మి.మీ., తడలో 107.2, సత్యవేడు 94.2, పిచ్చాటూరు 92.2, కేవీబీపురం 89.6, నారాయణవనం 76.4, వడమాలపేట 56.4, పుత్తూరు 50.8, బీఎన్‌కండ్రిగ 45.0, నాగలాపురం 35.4, సూళ్లూరుపేట, డీవీ సత్రం 32.8, తొట్టంబేడు 24.6మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. జిల్లా సగటు 33.5మి.మీగా నమోదైంది. అల్పపీడనం నేపథ్యంలో సముద్రంలో అలల ఉధ్రుతి పెరిగింది. నాలుగురోజులుగా చేపలవేట ఆగిపోయింది.

'సైనికులకు' భూకేటాయింపు తప్పేమీ కాదు

ఆ భూమిని వెనక్కి తీసుకోరాదు
తిరుపతి కలెక్టర్ నిర్ణయం సరికాదు
మూడు నెలల్లో నిషేధిత జాబితా నుంచి తొలగించాలన్న హైకోర్టు

అమరావతి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సైనికులకు.. మాజీ సైనికోద్యోగుల కోటా కింద భూకేటాయింపు చట్టవిరుద్ధం కాదని హైకోర్టు స్పష్టతనిచ్చింది. కేవలం మాజీ సైనికులకే భూమిని కేటాయించాలనే చట్టనిబంధన ఏదీ లేదని తేల్చిచెప్పింది. సర్వీసులోని సైనికులు, మాజీ సైనికోద్యోగులు కూడా భూకేటాయింపు కోసం జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని భూపరిపాలన ప్రధాన కమిషనర్ 2022లో సర్క్యులర్ జారీ చేశారని గుర్తు చేసింది. సర్వీసులో ఉన్న సమయంలో భూకేటాయింపు చేశారనే కారణంతో భూములను వెనక్కి తీసుకోవడానికి వీల్లేదని తెలిపింది. సాయుధ దళాల్లో సేవలందిస్తున్న వారిని ప్రోత్సహించేందుకు, సరిహద్దులను, ప్రజలను కాపాడుతున్నందుకు కృతజ్ఞతగా మాజీ సైనికులకు భూకేటాయింపు విధానాన్ని తీసుకొచ్చారని పేర్కొంది. నిబంధనలు అడ్డుపెట్టుకొని మంచి ఉద్దేశాన్ని దెబ్బతీయడానికి వీల్లేదని తెలిపింది. ఎక్స్ సర్వీస్‌మెన్ కోటా కింద పిటిషనర్‌కు కేటాయించిన 4.35 ఎకరాలను అడవి భూమని, అడవి పోరంబోకుగా పేర్కొంటూ రిజిస్ట్రేషన్ నిషేధిత భూముల జాబితా(22ఏ) నుంచి తొలగించడానికి తిరుపతి కలెక్టర్ నిరాకరించడాన్ని తప్పుపట్టింది. ఈ కేసు పూర్వాపరాలిలా ఉన్నాయి.

తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం పాగలి పరిధిలో తిరుపతికి చెందిన చెంచయ్య నాయుడికి మాజీ సైనికోద్యోగుల కోటాలో 4.35 ఎకరాలను 2009లో అధికారులు కేటాయించారు. 2019లో ఆ భూమిని విక్రయించేందుకు ప్రయత్నించగా నిషేధిత భూముల జాబితాలో ఉన్నాయని అధికారులు చెప్పారు. ఆ జాబితా నుంచి తొలగించాలని కలెక్టర్‌ను కోరగా.. భూమిని అడవి పోరంబోకుగా పేర్కొంటూ నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు నిరాకరించారు. అధికారుల నిర్ణయాన్ని సవాల్ చేస్తూ చెంచయ్యనాయుడు 2019లో హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల పై అభ్యంతరం ఉంటే భూపరిపాలన ప్రధాన కమిషనర్ వద్ద అప్పీల్ చేసుకోవాలని 2024లో వ్యాజ్యాన్ని పరిష్కరించారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాల్ చేస్తూ చెంచయ్య నాయుడు 2015లో ధర్మాసనం ముందు అప్పీల్ వేశారు. సైనికోద్యోగి తరఫున న్యాయవాది ఎంఆర్‌కె చక్రవర్తి వాదనలు వినిపిస్తూ.... మాజీ సైనికోద్యోగులకు కేటాయించిన భూమిని పదేళ్ల తరువాత విక్రయించుకొనేందుకు వెసులుబాటు ఉందన్నారు. అందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జీవోలు ఇచ్చిందన్నారు. ఏర్పేడు తహశీల్దార్ సమాచార హక్కు చట్టం కింద ఇచ్చిన వివరాలు ప్రకారం ఆ భూమిని తక అడవిగా వర్గీకరించారన్నారు. కలెక్టర్ మాత్రం భూమిని అడవి పోరంబోకుగా పేర్కొంటూ నిషేధిత జాబితా నుండి తొలగించేందుకు నిరాకరించారన్నారు. సీసీఎల్ఏ సర్క్యులర్ ప్రకారం సర్వీసులో ఉన్న సైనికులు సైతం భూముల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని వాదించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. అడవి, అడవి పోరంబోకు పదాల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పరిగణనలోకి తీసుకోకుండా కలెక్టర్ యాంత్రికంగా ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొంది. తహశీల్దార్ ఇచ్చిన నివేదికలో భూమి అడవి పోరంబోకు అని చెప్పేందుకు ఎలాంటి ఆధారాలూ లేనప్పటికి పిటిషనర్ భూమిని అడవి పోరంబోకుగా నిర్ధారిస్తూ జిల్లా కలెక్టర్ ఎలా ఉత్తర్వులు ఇచ్చారో అర్థం కావడం లేదని పేర్కొంది. మూడునెలల్లో భూమిని నిషేధిత జాబితా నుండి తొలగించాలని తిరుపతి కలెక్టర్‌ను ఆదేశించింది. ఆ లోపు తొలగించకుంటే భూముల బదిలీ/విక్రయం నిమిత్తం దస్త్రాలను సంబంధిత సబ్ రిజిస్ట్రార్ వద్ద ఉంచవచ్చని పిటిషనర్‌కు తెలిపింది. వాటిని పరిగణనలోకి తీసుకొని రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని సబ్‌రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ సుభేందు సమంతో ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది.

కాణిపాకంలో భక్తుల సదుపాయాలకు రూ.25 కోట్ల టీటీడీ నిధులు

తిరుపతి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాణిపాకం ఆలయ ప్రాంగణంలో భక్తుల బసకు కాంప్లెక్సు.. సామూహిక వివాహాల నిర్వహణకు పెద్ద హాళ్ల నిర్మాణానికి టీటీడీ రూ.25 కోట్లు మంజూరు చేయడానికి ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు అక్టోబరు 28న టీటీడీ పాలక మండలి సమావేశంలో తీర్మానించిన విషయం తెలిసిందే. దీనికి ప్రభుత్వ అనుమతి కోరుతూ ఈ నెల 10వ తేదీన టీటీడీ ఈవో లేఖ రాశారు. నిధులు విడుదల చేయడానికి టీటీడీ ఈవోకు అనుమతివ్వడంతో పాటు టెండర్లు పిలిచి ఆ పనులు చేపట్టాలని దేవదాయశాఖను ప్రభుత్వం ఆదేశిస్తూ మంగళవారం ఉత్తర్వులిచ్చింది.

తలకోనకు రూ.1.90 కోట్ల అదనపు సాయం

ఎర్రావారిపాలెం మండలం తలకోన సిద్ధేశ్వరాలయ పునరుద్ధరణ, అభివృద్ధి పనుల కోసం టీటీడీ రూ.1.90 కోట్ల మేరకు అదనపు సాయం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. ఆలయ పునరుద్ధరణకు రూ.18 కోట్లు ఇవ్వడానికి జూలైలోనే ప్రభుత్వం అనుమతిచ్చింది. మొదటి విడతగా రూ.2 కోట్లతో ఇ-టెండర్లు పిలిచారు. తాజాగా, బ్యాలెన్సు పనులు పూర్తి చేయడానికి అదనంగా రూ.1.90 కోట్ల కేటాయింపునకు అనుమతివ్వాలని కోరుతూ టీటీడీ ఈవో ప్రభుత్వానికి ఈనెల 11న లేఖ రాశారు.

టీటీడీ డైరీ, క్యాలెండర్లు ఉచితంగా వద్దు

తిరుమల, నవంబరు18(ఆంధ్రజ్యోతి): టీటీడీ డైరీలు, క్యాలెండర్లను ఉచితంగా తీసుకోరాదని బీఆర్ నాయుడు నిర్ణయించుకున్నారు. ఛైర్మన్ హోదాలో ఉన్నవారికి కొన్ని డైరీలు, క్యాలెండర్లను టీటీడీ ఉచితంగా ఇవ్వడం ఆనవాయితీ. అదే పద్ధతిలో ఛైర్మన్‌కు పంపిన 2026 డైరీ, క్యాలెండర్లను ఆయన తిరస్కరించారు. తనకు అవసరమైతే గతేడాదిలాగే కొంటానన్నారు.

మహా నగరికి ఆమోదం



● 63 పంచాయతీలతో కలిపి గ్రేటర్ తిరుపతి
● మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం

తిరుపతి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సవరించిన తిరుపతి గ్రేటర్ తీర్మానానికి మున్సిపల్ కౌన్సిల్ ఆమోదముద్ర వేసింది. మంగళవారం మేయర్ డాక్టర్ శిరీష అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం ఎస్వీయూ సెనేట్ హాలులో జరిగింది. గత నెల 24న జరిగిన కౌన్సిల్ సమావేశంలో 53 గ్రామ పంచాయతీలతో పాటు 10 రెవెన్యూ గ్రామాలను గ్రేటర్‌లో విలీనం చేసిన ప్రతిపాదన చర్చకు ఆమోదముద్ర వేసిన విషయం తెలిసిందే. అయితే నగరానికి అతిచేరువలో మిగిలిపోయినవి, ప్రజలు, ప్రజాప్రతినిధుల అభీష్టం మేరకు భౌగోళిక స్వరూపం, పట్టణ లక్షణాలను పరిగణలోకి తీసుకున్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్ లేఖ మేరకు రెవెన్యూ గ్రామాలను తొలగించి అదనంగా 10 గ్రామ పంచాయతీలు విలీనం చేసేందుకు ఆమోదం కోసం అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. గత సమావేశంలో గొడవ నేపథ్యంలో ఈసారి పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఈ సమావేశంలోనూ రాద్ధాంతం చేయాలని వైసీపీ భావించింది. పది లక్షల జనాభాతో గ్రేటర్ ఏర్పాటు చేయాలంటూ ఆ పార్టీ కార్పొరేటర్లు ప్లకార్డులు ప్రదర్శించారు. తవకుఉ 12 లక్షల జనాభాతో పెట్టినా అభ్యంతరం లేదంటూ డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణ, సభ్యులు ఎస్కే బాబు, నరసింహాచారి, నరేంద్రనాథ్ తదితరులు చెప్పడంతో వారి నోట మాట రాలేదు.

మరింత విస్తరణ అవసరం

తిరుపతి కేంద్రంగా నలువైపులా కల్యాణిడ్యాం, రాయలచెరువు, అంజారమ్మకణం, ఏర్పేడు ఐఐటీ, ఐజర్ వరకు విస్తరిస్తే భవిష్యత్ తరాలకు మంచి చేసినట్లవుతుందని మేయర్ శిరీష అభిప్రాయపడ్డారు. గ్రేటర్ పరిధిలోకి తిరుమలనూ తీసుకోవాలని ఎంపీ గురుమూర్తి సూచించారు. 'గ్రేటర్'పై తమ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉండబట్టే అత్యవసర సమావేశాన్నీ ఏర్పాటు చేశామని, మేయర్ ప్రతిపాదనలనూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. పాలనాసౌలభ్యం, మౌలిక వసతుల రూపకల్పన, ఆదాయం, అర్బన్ స్వరూపం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రతిపాదనలను సిద్ధం చేసినట్లు కమిషనరు మౌర్య చెప్పారు. తొలుత 10 లక్షల జనాభాతోనే పరిశీలించినా అనుకూల అంశాలు తక్కువగా ఉన్నాయన్నారు. గ్రేటర్ క్రెడిట్ సీఎం చంద్రబాబుదేనని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ చెప్పారు.

ప్రస్తుతం	విలీనం తర్వాత
మున్సిపల్ పరిధి : 30.17 కి.మీ	వచ్చే ఆదాయం : రూ.43కోట్లు
నగర జనాభా: 4.52 లక్షలు	మొత్తం ఆదాయం: రూ.192 కోట్లు
ఆదాయం : రూ.149 కోట్లు	63 గ్రామాల జనాభా : 3.4 లక్షలు
	మొత్తం జనాభా :7.86 లక్షలు

కొత్తగా చేరిన పంచాయతీలు

తిరుపతి రూరల్ మండలంలోని బ్రాహ్మణపట్టు, కుంట్రపాకం, గాంధీపురం, పెరుమాళ్లపల్లి, పుదిపట్ల.. చంద్రగిరి మండలంలోని రాయలపురం, బుచ్చినాయుడుపల్లె, పిచ్చినాయుడుపల్లె.. రేణిగుంట మండలంలోని అత్తూరు.. ఆర్సీపురం మండలంలోని సి.రామాపురం గ్రామ పంచాయతీలను చేర్చనున్నారు.

గ్రేటర్‌లో మేము కలవలేం

● తిరుపతి రూరల్‌లో 32 పంచాయతీల విముఖత ● సాయినగర్, న్యూమంగళం అనుకూలం

తిరుపతిరూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ తిరుపతిలో కలిసేందుకు రూరల్ మండలంలోని ప్రజాప్రతినిధులు విముఖత చూపారు. గ్రేటర్‌లో విలీనానికి 34 పంచాయతీల పాలకమండళ్ల అభిప్రాయ తీర్మానాలను పంపాలని కోరుతూ ఈనెల4న డీపీవో పేరిట నోటీసులు జారీ అయ్యాయి. పదిరోజుల్లోపు తీర్మానాలను సమర్పించాలని పేర్కొన్నారు. ఈ క్రమంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశాల్లో 32 పంచాయతీల పాలకమండళ్లు గ్రేటర్‌లో కలవలేమంటూ తీర్మానించారు. సాయినగర్, న్యూమంగళం(శెట్టిపల్లె) పంచాయతీలు మాత్రం అనుకూలంగా తీర్మానం చేశాయి. తమకు స్థానికంగా రాజకీయ భవిష్యత్ ఉండదన్న భయంతో గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు విలీనాన్ని తిరస్కరిస్తున్నారని తెలుస్తోంది. పాలక మండళ్ల తీర్మానాలను జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తామని ఇన్‌చార్జి ఎంపీడీవో దయాసాగర్ తెలిపారు.

కడలి కల్లోలం



శ్రీనివాససత్రం వద్ద సముద్రంలో అలల ఉధృతి

కోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మంగళవారం విడవని ముసురు, చలిగాలులతో పాటు మోస్తారు వర్షం కురిసింది. కోట మండలం గోవిందపల్లిపాళెం, శ్రీనివాససత్రం సముద్రంలో అలల ఉధృతి పెరిగింది. నాలుగు రోజులుగా సముద్రంలో చేపలవేట ఆగిపోయిందని, బోట్లు, వలలు, సముద్రపు ఒడ్డుకు చేర్చామని మత్స్యకారులు చెబుతున్నారు. సముద్రంతీరంలో అలలు భారీగా ఎగిసిపడుతుండడంతో గోవిందపల్లిపాళెం, శ్రీనివాససత్రం, వావిళ్లదొరువు, కొత్తపట్నం, యమదిన్నెపాళెం, గున్నంపడియ గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

రోజంతా ముసురు

సూళ్లూరుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో సూళ్లూరుపేటలో మంగళవారం ఉదయం నుంచి ముసురు వాతావరణం నెలకొంది. ఉదయం నుంచే కారుమబ్బులు కమ్ముకుని చల్లనిగాలులు, చలి వాతావరణం కనిపించింది. సాయంత్రం నుంచి మోస్తరు వర్షం కురిసినా, రాత్రి 7 గంటల తరువాత భారీ వర్షం కురిసింది.

గూడూరులో మోస్తరు వర్షం

గూడూరు అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం కొంతసేపు వర్షం పడి ఆగింది. మళ్లీ సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా మోస్తారు వర్షం కురిసింది. పట్టనంలోని పలు ప్రాంతాల్లో వర్షపునీరు రోడ్లపై ప్రవహించడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

నాయుడుపేటలో...

నాయుడుపేట టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ముసురుతో కూడిన జల్లులు కురిశాయి. మంగళవారం తెల్లవారుజాము నుంచి కురుస్తున్న వర్షానికి మండలంలోని పుదూరు పొలాల్లో వర్షపునీరు చేరడంతో చెరువులను తలపిస్తున్నాయి. రబీ సీజన్ ప్రారంభమై వరినాట్లు వేస్తున్న సమయంలో వర్షం కురవడంతో పనులకు ఆటంకం కలిగింది. వరినాట్ల కోసం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు ఇబ్బందులు పడుతున్నారు.

మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ సురేంద్రబాబు, పక్కన ప్రిన్సిపాల్ శంకర్ శర్మ తదితరులు

సూళ్లూరుపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ సురేంద్రబాబు అన్నారు. మంగళవారం స్థానిక వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ కూడా అవసరమన్నారు. అనంతరం మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలంటూ విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ, వైస్ ప్రిన్సిపాల్ విక్టోరియా రాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.


మోదీ పాలనలో బహుజనులకు రక్షణ కరువు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

వెంకటగిరి టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పాలనలో దళిత, గిరిజన మైనార్టీలకు రక్షణ లేకుండా పోయిందని సీపీఐ జిల్లా కర్యవర్గ సభ్యుడు చిన్నం పెంచలయ్య ఆరోపించారు. మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగణనలో కులగణన చేపట్టాలన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చి 11ఏళ్లలో దళిత, గిరిజన, మహిళా, మైనార్టీ, బడుగు బలహీన వర్గాలపై దాడులు పెరిగిపోయాయన్నారు. దేశంలో మతోన్మాద పాలన కొనసాగుతోందని, కుల, మత వివక్షత హింస పెట్రేగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బలాకృష్ణ, కత్తి రవి, శివ, జాన్, అంకయ్య, ప్రసాద్, పెంచలయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కులగణన చేపట్టాలి



టవర్‌క్లాక్ సెంటర్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

గూడూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జనగణనలో కులగణన చేపట్టాలని సీపీఐ నాయకులు అన్నారు. మంగళవారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళలపై దాడులు పెరిగిపోయాయన్నారు. కులగణన చేపట్టి, అందుకు అనుగుణంగా రిజర్వేషన్ అమలు పరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, శశికుమార్, సీవీఆర్ కుమార్, జమాలుల్లా, రమేష్, భాస్కర్‌గౌడ్, సునీల్, రాఘవులు, సంపూర్ణ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అంతర కళాశాలల గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌లో ఓవరాల్ చాంపియన్‌గా ఎస్వీ ఆర్ట్స్ కళాశాల

తిరుపతి(క్రీడలు), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో గతవారంలో జరిగిన అంతర కళాశాలల గేమ్స్ అండ్ స్పోర్ట్స్ పోటీల్లో శ్రీవేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల(అటానమస్)జట్టు మూడు విభాగాల్లో విజయం సాధించి ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. గేమ్స్ విభాగంలో అగ్రస్థానం దక్కించుకొని రూ.30వేలు, అథ్లెటిక్స్ విభాగంలో జాయింట్ చాంపియన్‌షిప్ సాధించి రూ.15వేలు, వ్యక్తిగత ప్రతిభ ప్రదర్శించిన సుదర్శన్ చాంపియన్‌గా నిలిచి రూ.1,500 నగదు బహుమతులను అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో క్రీడాకారులను అభినందించారు. మెడల్స్, ట్రోఫీ, షీల్డ్‌లను ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం కళాశాలకు గర్వకారణమన్నారు. దీనికి ప్రత్యేక కృషిచేసిన ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎస్.ముస్తాక్ అహ్మద్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.మల్లికార్జునరావు, అధ్యాపకులు ఎం.కిరణ్‌కుమార్‌రాజు, భీమన్న తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

నాయుడుపేట టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష పడింది. అర్బన్ సీఐ బాబి కథనం మేరకు.... 2021లో నాయుడుపేట మండలం వేముగుంటపాళెం గ్రామానికి చెందిన మల్లికార్జున్ ఓ బాలికకు మాయమాటలు చెప్పి అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆ బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో కోర్టు న్యాయమూర్తి మంగళవారం తీర్పు ఇచ్చారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

నాయుడుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఈనెల 20 వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ కుమారి తెలిపారు. బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, మైక్రో బయాలజీ, కంప్యూటర్ అప్లికేషన్స్, బీఏ, బీకాం కోర్సులు ఉన్నాయన్నారు. విద్యార్థులు ఇంటర్ మార్క్స్ లిస్టు, కుల ధృవీకరణ పత్రం, ఆధార్, టీసీ తీసుకువచ్చి అడ్మిషన్ పొందవచ్చన్నారు.

ప్లాస్టిక్ కవర్ల స్వాధీనం

సూళ్లూరుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు దుకాణాల్లో మంగళవారం మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య సిబ్బందితో కలిసి దాడులు చేశారు. 45 కిలోల ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ప్లేట్లను స్వాధీనం చేసుకున్నారు. దుకాణదారులకు జరిమానా విధించారు.



రైల్వేస్టేషన్, క్వార్టర్స్ సమీపంలో దెబ్బతిని గోతులమంగా ఉన్న రోడ్డు

మడుగుల్లా రోడ్లు..!

రాకపోకలకు అవస్థలు పడుతున్న స్థానికులు

గూడూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. పెద్దపెద్ద గోతులు ఏర్పడి వర్షపునీటితో మడుగులను తలపిస్తున్నాయి. చిన్నపాటి వర్షానికే రోడ్లలో నీరు నిల్వచేరి గోతుల లోతు తెలియక వాహనదారులు ప్రమాదాలకు లోనవుతున్నారు. రెండో పట్టణం నుంచి ఒకటో పట్టణానికి రాకపోకలు సాగించే ప్రధాన రహదారిలో స్వర్ణభారతి నగర్ సమీపంలోని రైల్వేగేటు వద్ద వర్షం పడిదంటే మోకాలు లోతు నీరు నిల్వ చేరిపోతుంది. ఈ మార్గం ద్వారా ఒకటో - రెండో పట్టణాలకు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధానంగా ఎస్కేఆర్ డిగ్రీ, జూనియర్ కళాశాల, ఐటీ, సిరామిక్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు వెళ్లడానికి ఒకటో పట్టణానికి చెందిన విద్యార్థులు, ప్రజలు ఈ మార్గం ద్వారా రాకపోకలు సాగిస్తుంటారు. చిన్నపాటి వర్షానికే నీరు చేరి మడుగుగా మారడంతో వాహనదారులు, పాదచారుల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. అదేవిధంగా రైల్వేస్టేషన్, రైల్వేక్వార్టర్స్ సమీపంలో రోడ్డు దెబ్బతిని గోతులు ఏర్పడ్డాయి. వర్షపు నీరు చేరడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి రోడ్లను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



రైల్వేగేటు సమీపంలో నిల్వ చేరిన వర్షపునీరు

కాస్త గూడు కల్పించండి సారూ..!

పక్కా గృహాలు లేక గిరిజనుల అవస్థలు ● వర్షాలు వస్తే పునరావాస కేంద్రమే దిక్కు



గిరిజనులు నివాసం ఉంటున్న పూరి గుడిసెలు

కోట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కోట మండలం తిన్నెలపూడి పంచాయతీ పరిధిలోని స్వర్ణముఖినది ఒడ్డున ఉన్న యానాదుల కాలనీలోని గిరిజనులు గూడులేక అవస్థలు పడుతున్నారు. ఇక్కడ గత రెండు దశాబ్దాలుగా 40 కుటుంబాలకు పైగా యానాదులు నివాసం ఉంటున్నారు. వీరంతా పక్కనే ఉన్న స్వర్ణముఖి నదితో పాటు ఉప్పుటేరులో చేపలు వేటాడి పట్టుకొచ్చి అమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని వీరికి సరైన గూడులేదు. అందరూ తాటాకులతో పూరిపాకలు వేసుకొని నివాసం ఉంటున్నారు. భారీ వర్షం, తుఫాన్ వస్తే గిరిజనులు నివాసం ఉంటున్న పాకలన్నీ గాలికి కొట్టుకుపోతాయి. పిల్లా పెద్దలతో పాటు రెండు కిలోమీటర్ల దూరంలోని తిన్నెలపూడికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలలోని పునరావాస కేంద్రంలో తలదాచుకుంటారు. ఏటా వర్షా కాలంలో గిరిజనులకు ఇబ్బందులు తప్పడంలేదు. అధికారులు స్పందించి తమకు పక్కా గృహాలు మంజూరు చేయాలని యానాదులు కోరుతున్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించండి

చిల్లకూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల అభివృద్ధి సహకరించాలని డిప్యూటీ ఎంపీడీవో అజిత్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు గ్రీన్ విలేజ్, థీమ్-5 క్లీన్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరిచి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రజలు మొక్కలు నాటి వాటి పరిరక్షణ బాధ్యత తీసుకోవాలని కోరారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పచ్చదనాన్ని పెంచేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు శ్రీనివాసులు, అల్లీహుస్సేన్, నాగూరయ్య, రాజా, సర్పంచులు పాల్గొన్నారు.

అర్హులందరికీ అన్నదాత సుఖీభవ

పెళ్లకూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అర్హులైన రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి అందుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బుధవారం నాయుడుపేట శ్రీనివాస కళ్యాణ మండపంలో జరిగే అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, కలెక్టర్ వెంకటేశ్వర్, టీడీపీ ఇన్‌చార్జి, మాజీఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని రైతులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరవ్వాలని కోరారు.

మస్టర్లు సిద్ధం చేసేద్దాం!



ఎంపీడీవో కార్యాలయంలో మస్టర్లు సిద్ధం చేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు

కోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కోట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఆఘమేఘాలపై మస్టర్లను రెడీ చేశారు. 2024-2025 ఆర్థిక సంవత్సరంలో మండలంలో జరిగిన ఉపాధి పనులు, నగదు లావాదేవీలు, కూలీల వేతనాలకు సంబంధించి గురువారం అన్ని పంచాయతీల్లో బహిరంగ సామాజిక తనిఖీలు జరగనున్నాయి. డీఆర్‌పీలు, ఎస్ఆర్‌పీలు గ్రామాల్లో ఇంటింటా తిరిగి ఉపాధి పనుల సంబంధించి విచారణ చేయనున్నారు. ఈనేపథ్యంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఎంపీడీవో కార్యాలయంలోని గదిలో తలుపులు వేసుకొని ఉపాధి పనులకు సంబంధించిన మస్టర్లు చకచకా సిద్ధం చేశారు.

కుష్ఠువ్యాధి సర్వే సమగ్రంగా చేపట్టాలి

ఓజిలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధి సర్వేను సమగ్రంగా నిర్వహించాలని ఓజిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ డానియేల్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌వో సుబ్బరామయ్య పర్యవేక్షణలో కుష్ఠువ్యాధి సర్వేను జరుగుతుందన్నారు. తెల్ల మచ్చలు, స్పర్శలేని పొడలు వంటివాటిని గుర్తించి పరిశీలనకు తీసుకోవాలని సూచించారు.

గ్రామాల అభివృద్ధికి తోడ్పడండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ధనలక్ష్మి

నాయుడుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి అన్నారు. నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం క్లీన్ అండ్ గ్రీన్‌పై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని, తాగునీటిని క్లోరినేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్‌బాబు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

సూళ్లూరురుపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రంథాలయాలు విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకుడు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

తడ: మండల పరిధిలోని వేనాడు ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తక పఠనంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు గురువారం బహుమతులను ప్రదానం చేస్తామని గ్రంథాలయ కార్యదర్శి కల్యాణి తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గాయత్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంతో పర్యావరణ పరిరక్షణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సేద్యంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని పద్మావతి వర్సిటీ ఉమెన్ స్టడీస్ అధ్యాపకురాలు నీరజ పేర్కొన్నారు. ఆర్సీపురం మండలం కుప్పంబాదూరులో ప్రకృతి వ్యవసాయంపై చేపట్టిన శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఇటు మనిషికీ, అటు పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. మహిళలు ప్రకృతి వ్యవసాయ విధానాన్ని అనుసరిస్తే అందరికీ అవగాహన ఏర్పడుతుందన్నారు. దీంతో మహిళలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. విమల, రాగమ్మ, మేఘన, జయశ్రీ, మహిళా రైతులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు ప్రణాళికలు

కోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళా సాధికారత సాధించడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వెలుగు ఏపీఎం అనీల కోరారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సంఘమిత్ర అధ్యక్షురాలు కొండేటి ముత్యాలమ్మ ఆధ్వర్యంలో సంఘబంధం అధ్యక్షురాళ్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కోట మండలం మోడల్‌గా ఏర్పడిన నేపథ్యంలో పొదుపు సంఘాల మహిళలు అభివృద్ధి సాధించేలా సంఘ బంధం అధ్యక్షులు అవగాహన కల్పించాలన్నారు. అలాగే మహిళల విద్య, ఆరోగ్యం, వైద్యం, సామాజిక భద్రత, ఆర్థిక సుస్థిరత, స్థిరమైన ఆస్తి కలిగి ఉండటం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో సీసీలు ప్రసాద్, శంకర్, భాస్కర్, సుబ్రహ్మణ్యం, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ మండలంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

బాలాయపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందని వెలుగు ఏపీఎం కిరణ్ అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సంఘమిత్ర సభ్యులు, వీవోఏలకు శిక్షణ కర్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, సామాజిక భద్రత, ఆస్తుల సృష్టి, జీవనోపాధిపై అవగాహన కల్పించారు. గ్రామస్థాయిలో వార్షిక ప్రణాళిక రూపొందించి, తద్వారా గ్రామ, మండల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో శిక్షణ అధికారి చెంగల్‌రాయులు, ఎల్‌సీ సీసీ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల నేరవేర్చడమే ధ్యేయం



లబ్ధిదారులకు ఇంటి ధ్రువపత్రాలు అందజేస్తున్న డీఎల్‌పీవో వాణి

వాకాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి పేదవాడికి సొంతింటి కల నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నాయకుడు దువ్వూరు మధుసూదనరెడ్డి అన్నారు. మండలంలోని కొండూరుపాళెంలో స్వామిత్వ గ్రామసభ మంగళవారం ఎంపీడీవో సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. 181 మంది పేదలకు మంజూరైన ఇళ్ల ధృవపత్రాలను డీఎల్‌పీవో వాణి, టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో దేవదానం, పంచాయతీ కార్యదర్శి శివకుమారి పాల్గొన్నారు.

నేడు క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌పై శిక్షణ

ఓజిలి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌పై బుధవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నారాయణరెడ్డి తెలిపారు. సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యదర్శులు, సంఘ బంధాల సభ్యులు, గ్రీన్ అంబాసిడర్లు, ఎమ్మార్పీలు హాజరు కావాలని ఆయన కోరారు.

కోటి సంతకాల సేకరణ

కోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోట క్రాస్‌రోడ్డులో మంగళవారం వైసీపీ నాయకులు కోటి సంతకాల సేకరణ చేపట్టారు. వైసీపీ మండల ప్రధాన కార్యదర్శి పాముల సురేంద్ర, యువజన విభాగం నాయకులు గంపా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పచ్చదనం, పరిశుభ్రతపై సర్పంచులకు శిక్షణ

బాలాయపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక సచివాలయంలో మంగళవారం పరిశుభ్రత, పచ్చదనంపై ఎంపీడీవో నారాయణ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు, పచ్చదనం పెంపునకు పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ, ఏవో వినీల్‌కుమార్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో నారాయణ

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో సూళ్లూరుపేట విద్యార్థిని ప్రతిభ



తైక్వాండోలో కాంస్య పతక విజేత పర్ణికతో కోచ్‌లు ప్రభ, పవన్‌కుమార్

సూళ్లూరుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో సూళ్లూరుపేటకు చెందిన విద్యార్థిని పర్ణిక సత్తాచాటిందని మాస్టర్లు ఎస్.ప్రభ, పవన్ కుమార్ తెలిపారు. ఈనెల 15,16న కాకినాడలో రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు జరిగాయి. ఇందులో సూళ్లూరుపేటకు చెందిన పర్ణిక సబ్ జూనియర్ బాలికల విభాగంలో కాంస్య పతకం సాధించింది. జూనియర్ బాలుర విభాగంలో బాలవెంకట కార్తికేష్ ప్రతిభ చూపాడు. వీరిని రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి భగత్, నెల్లూరు జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షురాలు మనీషా, ప్రధాన కార్యదర్శి అఖిల్, ఉపాధ్యక్షుడు ముఖేష్ అభినందించారు.

సౌదీ బస్సు ప్రమాద మృతులకు నివాళి



క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

వాకాడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సౌదీలో జరిగిన బస్సు ప్రమాదంలో మృతి చెందిన ఉమ్రా యాత్రికులకు వాకాడులో ముస్లింలు నివాళులర్పించారు. స్థానిక జామియా మసీదు నుంచి బీసీ కాలనీ వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లిం ఐక్యవేదిక మండల అధ్యక్షుడు ఖాజా రహంతుల్లా, ప్రధాన కార్యదర్శి ఫయాజ్, ఉపాధ్యక్షులు షేక్ మస్తాన్, జాయింట్ సెక్రటరీలు కాలేషా, రహీం, అక్బర్, ట్రెజరర్ జిలానీ, యస్‌దాని బాషా తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కోసం పోరాటం



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

సూళ్లూరుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పాలనలో దేశంలో సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, సమానత్వ సాధన కోసం పోరాడాల్సిన పరిస్థితి నెలకొందని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు ఇలపా నాగేంద్ర అన్నారు. మంగళవారం ఆర్టీసీ బస్టాండు వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ముస్లిం మైనార్టీ, దళిత, గిరిజనులపై దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రమణయ్య, శ్రీనివాసులు, ప్రభుదాస్, కోటయ్య, శీనయ్య, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధిపై శిక్షణ

కోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కోట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు స్థానిక సంస్థల సుస్థిరావృద్ధి లక్ష్యాలపై శిక్షణ ఇచ్చారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పంచాయతీలకు అందుతున్న నిధులు, వినియోగం తదితర అంశాల గురించి వివరించారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్రపై ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్ అవగాహన కల్పించారు.